ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 4 సెప్టెంబరు 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్టం : 29.0
కనిష్టం : 25.0



శిథిలావస్థకు చేరిన శనివారపుపేట కాజ్‌వే

జోరు తగ్గిన తమ్మిలేరు

ఏలూరు క్రైం/చింతలపూడి, సెప్టెంబరు 3: తమ్మిలేరు వరద ప్రవాహం తగ్గడంతో ఏలూరు నగర వాసులు, కొల్లేరు పరివాహక ప్రాంత లంక గ్రామాల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. నాలుగు రోజుల నుంచి కురిసిన వర్షాలకు వరద నీరు తమ్మిలేరు వాగు ద్వారా రావడంతో శనివారపుపేట కాజ్‌వేపై నుంచి నీరు ప్రవహించింది. రెండు రోజుల పాటు ఆ కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేశారు. మంగళవారం ఉదయం వరద నీరు తగ్గడంతో వాహనాల రాకపోకలకు పోలీసులు అనుమతించారు. బ్రిడ్జి కొద్ది భాగం దెబ్బతింది. సిమెంటు దిమ్మ విరిగిపోయి రోడ్డు భాగం కొంత పాడైపోయింది. ముందుస్తుగా పోలీసులు ఆ ప్రాంతంలో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా స్టాపర్లను ఏర్పాటు చేశారు.



ముదినేపల్లి వద్ద పోల్ రాజ్ మేజర్ డ్రెయిన్

కలవరపెడుతున్న డ్రెయిన్లు

- ప్రవాహానికి కిక్కిస అడ్డంకి
- పొలాల్లో తగ్గని ముంపు

ముదినేపల్లి, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు ముదినేపల్లి ప్రాంతంలోని మేజర్, మీడియం డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. పెదలంక, పెదకొమ్మిలేరు, చిన కొమ్మిలేరు, తుమ్మిడి - చెన్నూరు మేజర్ డ్రెయిన్లతోపాటు అన్నవరం, వూటుకూరు, కేవీ మీడియం డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. వేలాది ఎకరాల విస్తీర్ణంలో వరి పైరు ముంపులో చిక్కుకుంది. డ్రెయిన్లలో కిక్కిస, గుర్రపు డెక్క, తూడు విపరీతంగా పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. పెదలంక మేజర్ డ్రెన్‌లో దేవపూడి నుంచి కోరుకొల్లు వరకు సుమారు 4 కిలోమీటర్లు పెరిగిన కిక్కిస తొలగింపు చేపట్టకపోవటంతో మురుగు నీరు కదలని పరిస్థితి ఏర్పడింది. వూటుకూరు మీడియం డ్రెయిన్‌లో కూడ కిక్కిస పేరుకుపోయింది. పెదలంక మేజర్ డ్రెన్ పరిధిలో సుమారు 5 వేల ఎకరాల్లో వరికి ముప్పు ఉంది. పోల్ రాజ్ డ్రెయిన్ కూడ ఉధృతంగా ప్రవహిస్తూ రైతులను ఆందోళనకు గురి చేస్తున్నది.

మండవల్లి: ఎగువ నుంచి డ్రెయిన్ల ద్వారా వరద నీరు కొల్లేరులో చేరడంతో కొల్లేటిలంక గ్రామాలకు ముంపు పొంచి ఉంది. ప్రధాన రహదారైన పెద్దఎడ్లగాడి, పెనుమాకలంక ఆర్‌అండ్‌బి రహదారి జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఏలూరు-కైకలూరు రహదారిపై వరద నీరు చేరుతోంది. వరద ఉధృతి కొనసాగితే కైకలూరు-ఏలూరు రాకపోకలు నిలిచిపోతాయని ఆందోళన చెందుతున్నారు. పెద్దఎడ్లగాడి వద్ద గుర్రపుడెక్క, తూడు తొలగిస్తున్నారు.

వరద గోదారి పొంచివున్న గండం



పోలవరం స్పిల్‌వే వద్ద గోదావరి ఉధృతి

ఒకవైపు భారీ వర్షాలు. పొంగుతున్న వాగులు, వంకలు. తమ్మిలేరు, రామిలేరు ఉధృతి, కృష్ణ కాలువకు గండితో పరీవాహక ప్రాంతాలు, జాతీయ రహదారి నీట మునిగాయి. మరోసారి రానున్న 48 గంటల్లో భారీ, అతి భారీ వర్షాల హెచ్చరికతో వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అదే సమయంలో గోదావరి ఉరకలు వేస్తోంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గంట గంటకు ఉధృతి పెరుగుతోంది. ఆ నీరంతా దిగువన పోలవరం వైపు దూకుతోంది. గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలను యంత్రాంగం అప్రమత్తం చేసింది. ముందు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక అధికారులకు సూచించారు.

ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- ఎగువన భారీ వర్షాలు
- పొంగుతున్న ఉప నదులు
- గోదావరికి పోటెత్తుతున్న వరద
- భద్రాచలం వద్ద 40 అడుగులకు చేరిన నీటి మట్టం
- పోలవరం స్పిల్‌వే వద్ద 29 అడుగులు
- వేలేరుపాడు, కుక్కునూరు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆందోళన
- అధికార యంత్రాంగం అప్రమత్తం
- కలెక్టర్, ఎమ్మెల్యేలు సమీక్ష
- ముందస్తు చర్యలు వేగవంతం

భారీ వర్షాలు ఏలూరు జిల్లాను గడగడలాడించాయి. కనీవినీ ఎరుగని రీతిలో నూజివీడు ధ్వంసమైంది. ప్రస్తుతం మరో వరద పొంచి ఉంది. ఎగువన భారీ వర్షాలతో గోదావరి వడివడిగా ఉరకలు వేస్తోంది. గంట గంటకు వరద పెరుగుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా గోదావరి మరోసారి భయపెడుతోంది. బుడమేరు, రామిలేరు ఉధృతి, కృష్ణ కాల్వ గండితో మూడు రోజులుగా జిల్లాలో పలు మండలాలు నీట మునిగి ఉన్నాయి. పెద్ద ఎత్తున ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చింది. మెట్ట ప్రాంతంలోనే ఈ తరహా పరిస్థితి ఎదురవ్వడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. నివాస గృహాలు దెబ్బతిన్నాయి. హాస్టళ్లల్లోకి నీరు ముంచెత్తింది. చదువుకునే విద్యార్థులను సైతం సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చింది. ఎక్కడికక్కడ చెరువులకు గండ్లు పడ్డాయి. వందలాది ఎకరాలు నీట మునిగాయి. ఇప్పటికే ఖరీఫ్ ఆలస్యం కావడంతో రైతులు ఆందోళనలో ఉండగానే భారీ వర్షాలు రైతన్నకు కంట కన్నీరు రప్పించాయి. కొల్లేరు ప్రాంతంలో రోజురోజుకు నీటి మట్టం పెరుగుతోంది. కొల్లేరు సరస్సు అంతర్భాగంలో మూడు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా తమ్మిలేరు, రామిలేరు, బుడమేరు వాగులు ఉప్పొంగడం, కృష్ణ కాలువ ద్వారా భారీగా వరద నీరు కొల్లేరుకు తరలింది. ఈ నీరంతా నేరుగా ఉప్పుటేరులో కలుస్తుంది. భారీ వరదలతో లంక గ్రామాల చుట్టూ ఇప్పటికే పూర్తిగా నీరు చేరింది. కొన్ని లంకలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరికొన్నింటికి ప్రమాదం పొంచి ఉంది. రెండు రోజులుగా వాన తెరపిచ్చింది. మంగళవారం నాటికి వాగుల్లోను ప్రవాహం తగ్గుముఖం పట్టింది.

పోటెత్తుతున్న గోదావరి

వర్షాలు తెరపివ్వడంతో ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న జనం ముందు గోదావరి పోటెత్తడంతో భయపడతుఉన్నారు. భద్రాచలం వద్ద గంట గంటకు నీటి మట్టం పెరుగుతోంది. గడిచిన రెండు నెలల్లో గోదావరికి వరద రెండోసారి. గోదావరి ఉరకలు, పరుగులతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. భద్రాచలం వద్ద 43 అడుగుల మేర నీటిమట్టం నమోదైతే మొదటి ప్రమా ద హెచ్చరిక జారీ చేస్తారు. 48 అడుగులకు రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ప్రస్తుతానికి భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం మంగళవారం సాయంత్రం 40 అడుగులకు చేరింది. మొదటి ప్రమాద హెచ్చరికకు అత్యంత చేరువగా గోదావరిలో నీరు పెరుగుతుంది. గమనించిన అధికారులు ఎగువ నుంచి దిగువ వరకు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఇటీవల భారీ వర్షాలకు పెదవాగు ప్రాజెక్టు రిజర్వాయరు అప్రోచ్ కొట్టుకు పోయింది. ఎక్కడికక్కడ గ్రామాలు జలదిగ్బంధనానికి గుర య్యాయి. జిల్లా అధికారులు రంగంలోకి దిగి సమీక్షిస్తేనేగాని పరిస్థితులు చక్కబడలేదు. మళ్లీ గోదావరికి వరద పోటు పొంచి ఉంది. దీంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఎక్కడికక్కడ అధికారులను అప్రమత్తం చేశారు. గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అనువుగా అంబులెన్సు లను ఏర్పాటు చేశారు.

అమ్మో.. బుడమేరు

కొల్లేరు పరీవాహక ప్రాంతాల్లో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వాగులే పరిసర గ్రామాలను ఎప్పుడూ భయపెడుతుంటాయి. చాలా ఏళ్ల తరువాత బుడమేరు పొంగి విజయవాడ నగరాన్ని ముంచెత్తింది. వేలాది మందికి నరకం చూపించింది. అనూహ్యంగా బుడమేరులో పెరిగిన నీటి ఉధృతిని యంత్రాంగం కూడా అంచనా వేయలేకపోయింది. కొన్ని గంటల వ్యవధిలోనే పరీవాహక ప్రాంతంలో ఉన్న నివాస ప్రాంతాలను వరద నీరు చుట్టిముట్టింది. 20 ఏళ్ల క్రితం పెదపాడు మండలం కొణికి గ్రామాన్ని సైతం అప్పట్లో బుడమేరు వరద ముంచెత్తింది. బుడమేరు కొల్లేరులో కలిసే ముందు గ్రామాన్ని తాకుతూ ప్రవహిస్తుంది. సరిగ్గా ఈసారి కూడా బుడమేరు కొణికి గ్రామాన్ని దాదాపు చుట్టుముట్టింది. అయితే 20 ఏళ్ల క్రితం నాటి నష్టాలేవీ ఈసారి ఆ గ్రామం దరిచేరలేదు. కాని బుడమేరు క్షణాల్లో అంతకంతకు పెరిగి దూసుకురావడాన్ని మాత్రం గమనించి ఊరు ఊరంతా అప్రమత్తమైంది. సహజంగా పెదపాడు మండలానికి శివారు అయిన కొణికి గ్రామం కాస్తంత పల్లపు ప్రాంతంలో ఉంటుంది. దీంతో ఎగువ నుంచి వచ్చిపడుతున్న నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో వర్షాకాలంలో ఆ గ్రామవాసులంతా ఇబ్బంది పడుతూనే ఉంటారు. ఈసారి కూడా దాదాపు అదే జరిగింది. బుడమేరు నీరు ముంచెత్తి 24 గంటలపాటు గుక్కతిప్పుకోనీయకుండా చేసింది. సోమవారం ఉదయం నుంచి కాస్తంత తగ్గుముఖం పట్టడంతో ఈ గ్రామస్తులంతా ఊపిరి పీల్చుకున్నారు.

గంట గంటకు పెరుగుతున్న నీటిమట్టం

అధికారులు, ప్రజలు అప్రమత్తం కావాలి : కలెక్టర్ వెట్రిసెల్వి

గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. ముందు జాగ్రత్త చర్యలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ముంపు ముప్పు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం జాగ్రత్తలు పాటించాలన్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయకముందే ఆయా గ్రామాల్లో గర్భిణులు, అనారోగ్యంతో ఉన్నవారిని, వృద్ధులను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పునరావాస కేంద్రాల వద్ద నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచాలని పౌర సరఫరాల డిఎం, డిఎస్‌ఓ, మార్కెటింగ్ ఎడిలు ఈ మేరకు తక్షణ చర్యలు తీసుకోవడమేకాక కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, మస్కిటోకాయిల్స్ విద్యుత్ సౌకర్యంకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా తాగునీటి ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండి ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు.

వరదల్లో విశ్వరూపం

గోదావరిలో 1986 నాటికి 75.60 అడుగుల మేర రికార్డు స్థాయిలో వరద నీరు ఉరకలేస్తే అప్పట్లో 27 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గోదావరి పరివాహక చరిత్రలో ఇదే అత్యంత అరుదైన రికార్డు. 2022లో గోదావరి నీటిమట్టం 71.30 అడుగులకు పెరిగింది. 21 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలైంది. రెండేళ్ల క్రితమే గోదావరి ఉధృతికి ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు అతలాకుతల మయ్యాయి. వందలాది మంది నిరాశ్రయులయ్యారు. రోడ్లు కొట్టుకుపోయి రవాణా స్తంభించింది. రోజులు తరబడి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వందలాది మంది గిరిజనులు, గిరిజనేతరులు అటు కుక్కునూరు, వేలేరుపాడుతోపాటు పోలవరంలోను కొండల మీద విష సర్పాల మధ్యే బితికుబితుకుమంటూ గడిపారు. అప్పట్లో ఎగువ కాఫర్ డ్యాం కారణంగానే గోదావరి వరద ముంపు మండలాలను ముంచెత్తిందనే వాదన తెరముందుకు వచ్చింది. అప్పటి సీఎం జగన్ రెడ్డి ఈ రెండు మండలాలను సందర్శించి బాధితులకు సాయం చేస్తామని ప్రకటించినా అదీ చివరికి నెరవేరలేదు. ప్రస్తుతం వరద హెచ్చరికతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.



వేలేరుపాడులో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా..

- పోలవరం స్పిల్‌వే నుంచి 4.56 క్యూసెక్కుల నీటి విడుదల
- వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పర్యటన

పోలవరం / కుక్కునూరు / వేలేరుపాడు, సెప్టెంబరు 3: ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలతో గోదావరి ఉప నదులు మంజీర, ప్రవర, కిన్నెరసాని, శబరి, సీలేరు ఇంద్రావతి, ప్రాణహిత, పూర్ణ, పెన్‌గంగ, బిందుసార పొంగుతున్నాయి. ఉప నదుల జలాల చేరికతో గోదావరి నీటిమట్టం మంగళవారం అనూహ్యంగా పెరిగింది. రాత్రి 7 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 40 అడుగులకు చేరింది. బుధవారం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవ కాశాలున్నాయి. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 4,56,011 క్యూసెక్కుల జలా లను దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. స్పిల్‌వే ఎగువన 29.830 మీటర్లు, దిగువన 20.340 మీటర్ల నీటి మట్టం నమోదైనట్లు ఈఈలు మల్లికార్జునరావు, పి.వెంకటరమణ తెలిపారు. పోలవరం నుంచి పురుషోత్తపట్నం, పట్టిసీమ నుంచి పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయానికి రాకపోకలు సాగించే బోట్లను పోలీస్ అధికారులు నిలిపి వేశారు. కొవ్వాడ రిజర్వాయర్ నుంచి 260 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

మళ్లీ పునరావాసమే..

గొమ్ముగూడెం ప్రజలను తరలించడానికి అధికారు లు చర్యలు చేపట్టారు. కుక్కునూరు తహసీల్దార్ పెద్దిరాజు గ్రామస్థులు తరలివెళ్ళడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. జూలైలో గోదావరి వరదలతో గొమ్ముగూడెం గ్రామస్థులంతా దాచారం పునరావాస కాలనీకి తరలివెళ్ళారు. వారం రోజుల క్రితమే వారంతా ఇళ్ళకు తిరిగి వచ్చారు. గోదావరి మళ్లీ పెరుగుతుండడంతో మరోసారి పునరావాస కాలనీకి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. గోదావరి తీర ప్రాంతంలో దాదాపు వంద ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. గోదావరి పెరిగితే పంట మునిగిపోయే అవకాశం ఉందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేశారు.

సహాయక చర్యలు చేపట్టండి

భారీ వర్షాలతో గోదావరికి వరద నీరు చేరుతుందని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అధికారులకు సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాలైన రేపాకగొమ్ము, ఎద్దువాగు ప్రాంతాలను ఆర్డీవో అద్దయ్య, అధికారులతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాల్లో నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మేడేపల్లి, అల్లూరి నగర్, కోయమాధారం, గ్రామాల్లో తక్షణమే చేతిపంపులు వేయాలని అధికారులను ఆదేశించారు.



జెడ్పీ రోడ్డులో ట్రాఫిక్ పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

ఆకతాయిల ఆటకట్టిస్తాం

- విద్యార్థినులను వేధిస్తే చర్యలు
- 112 నెంబర్‌కు కాల్ చేయండి
- నగరంలో కాలినడకన ఎస్పీ పరిశీలన

ఏలూరు క్రైం, సెప్టెంబరు 3: విద్యార్థినులను ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని, వెంటనే 112కు కాల్ చేసి సమాచారం అందించాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ విద్యార్థినులకు సూచించారు. మంగళవారం సాయంత్రం ఏలూరు జిల్లా పరిషత్ రోడ్డు, ఇండోర్ స్టేడియం రోడ్లను మంగళవారం కాలినడకన ఎస్పీ పరిశీలించారు. అక్కడ ఉన్న విద్యార్థినులతో మాట్లాడి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏలూరు నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కాలేజీలు విడిచిపెట్టే సమయంలో విద్యార్థినులు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, ఏలూరు ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆ పాఠశాలలకు సెలవు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 3 : తరగతుల నిర్వహణకు వాతావరణ పరిస్థితులు అనుకూలించనందున బుధవారం జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్టు డీఈవో అబ్రహం మంగళవారం తెలిపారు. ఇంకా ఎక్కడైనా తరగతులు నిర్వహించలేని పరిస్థితులుంటే సంబంధిత పాఠశాలకు సెలవు ప్రకటించుకునే వెసులుబాటును కల్పించినట్టు ఆయన వివరించారు.



మున్సిపల్ మాయాజాలం

- ఏలూరులో పనులు చేయకుండానే బిల్లులు
- రూ.50 లక్షలు హాంఫట్

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 3: మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారుల మయాజలంతో అవినీతిని కొంతపుంతలు తొక్కిస్తున్నారు. పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు చేస్తున్నారు. టెండర్లు పిలవరు. నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టర్లు పనులు కేటాయిస్తారు. పనులు చేసి పర్సంటేజీ తీసుకోవడం అది పాతమాట. పనులు చేసినట్లు బిల్లులు చేసుకుని లక్షలాది రూపాయలు జేబులో వేసుకోవడం ఇప్పటి మాట. నగరపాలక సంస్థలో చేయని పనులకు రూ.50 లక్షలు పైగా అధికారులు మింగేశారు. తలా పాపం తిలా పిడికెడు అన్నచందంగా ఇంజనీరింగ్, అకౌంట్స్ అధికారులతో అందరూ భాగస్వాములేనని ఆరోపణలు వస్తున్నాయి. అవినీతిపై విచారణ చేపట్టిన కమిషనర్, విచారణాధికారి ఎస్ఈ రిటైర్ అయ్యారు. దీనితో విచారణ ఫైల్ మూలనపడింది.

పోణంగిలోని కంపోస్టు యార్డులో రూ.50.46 లక్షల విలువైన పనులు చేసినట్లు చూపించారు. వీటిని 11 పనులుగా విభజించి, కావల్సిన కాంట్రాక్టర్లకు ఇచ్చి పనులు చేయకుండానే చేసినట్లు సంతకాలు పెట్టించుకుని వారి వాట వారికి ఇచ్చేశారు. రూ.5 లక్షలు దాటిన పనులకు టెండర్లు పిలవాల్సి ఉండడంతో రూ. 50లక్షల పనులను 11 పనులుగా విభజించి రూ.5లక్షల లోపు పనుల పేరిట నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టర్లకు అప్పగించినట్లు చూపించారు. కంపోస్టుయార్డులో దారులు వేశామని డంపింగ్ యార్డులో లెవెలింగ్ చేశామని, వర్మీకంపోస్టు షెడ్డు నిర్మించినట్లు కంపోస్టు యార్డు లెవెలింగ్ చేసినట్లు ఒకటే పని 11రకాలుగా చూపి ప్రజాధనాన్ని గుటకాయ స్వాహా చేశారు. ఇంజనీరింగ్ విభాగంలోని ఒక మహిళా అధికారి ద్వారా ఈ తతంగం నడిపినట్లు సమాచారం. ఇంజనీరింగ్ విభాగంలో ఈఈ, ఏఈలు పనులను పర్యవేక్షించకుండానే కళ్లు మూసుకుని బిల్లులు మంజూరు చేశారని ఆరోపణ. అకౌంట్స్ విభాగంలో అకౌంటెంట్‌గా ఒక అనర్హురాలిని కూర్చోబెట్టారు. ఎగ్జామినర్ అభ్యంతరాలు తెలిపినప్పటికి పట్టించుకోకుండా ఆమె వాటా తీసుకుని సంతకాలు పెట్టినట్లు తెలుస్తోంది. ఈ 11పనులకు సంబంధించి కంపోస్టుయార్డు దగ్గర ఒక్క అనమాలు కూడా లేదని పలువురు చెబుతున్నారు. దీనిపై గత మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ విచారణ వేశారు. విచారణాధికారిగా సూపరిండెంటెంట్ ఇంజనీర్‌ను నియమించారు. ప్రస్తుతం వారిద్దరు రిటైర్ అయ్యారు. నూతనంగా వచ్చిన కమిషనర్ భానుప్రతాప్ ఆ ఫైల్‌ను దుమ్ముదులిపి విచారణ సజావుగా నిర్వహించి అవినీతి గుట్టు రట్టు చేసి నిజానిజాలు వెలికి తీయాలని నగర ప్రజలు కోరుకుంటున్నారు. ఈ కుంభకోణంపై కమిషనర్ భానుప్రతాప్‌ను వివరణ కోరగా తాను ఇంకా ఆ ఫైల్‌ను చూడలేదని, ప్రస్తుతం విజయవాడ వరద బాధితులకు ఆహార పదార్థాల సరఫరా పనుల్లో బిజీగా ఉన్నానని వివరణ ఇచ్చారు.

నేడు సర్‌ప్లస్ ఎస్జీటీలకు సర్దుబాటు కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 3: ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను భర్తీచేసేందుకు తొలి విడతలో సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్లు, బీఎడ్ అర్హతలుగల ఎస్జీటీలకు చేపట్టిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ముగిసింది. ఏలూరు డివిజన్‌కు సంబంధించి డీఈవో అబ్రహం అధ్యక్షతన నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 58 ఖాళీలను భర్తీచేయాల్సిఉండగా, 44 భర్తీచేయగలిగారు. హిందీ, ఇంగ్లీషు సబ్జె క్టుల్లో అర్హతగల టీచర్లు లేక ఖాళీలు ఉండిపోయాయి. తర్వాత సర్‌ప్లస్ ఎస్జీటీ పని సర్దుబాటు కౌన్సెలింగ్‌ను బుధవారం ఒక్కరోజులోనే పూర్తిచేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. జిల్లా పరిధిలోని ఎంఈవోలు ఎస్జీటీ కేడర్‌లో అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్‌ను బుధవారం ముగించాలని డీఈవో ఆదేశాలు జారీచేశారు. 28మండలాల్లో సుమారు 120మంది ఎస్జీటీలు సర్‌ప్లస్ జాబితాలో ఉన్నారు.


వంద కిలోమీటర్లకు సర్దుబాటు న్యాయమేనా : పీఆర్‌టీయూ

స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లకు మంగళవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పలువురిని వంద కిలోమీటర్లకు పైబడి దూరంలోని పాఠశాలలకు సర్దుబాటు చేయడం ఎంతవరకు న్యాయమని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ప్రశ్నించారు. జీవో 117 రద్దుచేసి వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను చేపట్టిఉంటే ఈ పరిస్థితులు తలెత్తేవికావని విమర్శించారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 3: ద్వారకాతిరుమల పంచా యతీ కార్యదర్శి లంకలపల్లి వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ పంచాయితీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీలో రూ.2 కోట్ల నిధుల దుర్వినియోగంతో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. ఇప్ప టికే రూ.1,30,85,013 నగదు రికవరీకి కార్యదర్శి వెంకటేశ్వర రావుకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. రూ.53,57,376 దుర్విని యోగం చేసిన సర్పంచ్ కుంతం స్వర్ణలత చెక్‌పవర్ రద్దుకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. సర్పంచ్ పదవి రద్దుపై కూడా నోటీస్ కూడా జారీ చేశారు. గతంలో ఇక్కడ స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేసిన ఎంపీడీవో ఎస్ ఆశీర్వాదంపై రూ. 18,73,538 నిదుల దుర్వినియోగం అభియోగంపై చర్యలు తీసుకోవాలని పంచాయితీరాజ్ కమిషనర్‌కు సిఫార్సు చేశారు. ప్రస్తుతం ఆయన ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెంలో పనిచేస్తున్నారు.





ఎన్టీఆర్ జిల్లాకు ఆహార పొట్లాలు పంపిస్తున్న కలెక్టర్, జేసీ

మేమున్నామని..

జిల్లాలో వరద సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాకు మంగళవారం 1.6 లక్షల ఆహార పొట్లాలను పంపించారు. కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రి రెడ్డి, అధికారులు ప్రత్యేక వాహనాల్లో ఆహారం పంపించారు. జిల్లాలోని పలు ప్రాంతాల ఆహారం పంపించారు. జిల్లా నుంచి పలువురు ఎమ్మెల్యేలు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు.

7

వరద ప్రభావిత ప్రాంతాలకు అదనపు వైద్య సిబ్బంది

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 3: జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను, కొయిడాలోని 11 నివాస ప్రాంతాలు, కుక్కునూరు మండలం గొమ్ముగూడెంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో శర్మిష్ట తెలిపారు. వరద బాధితులకు వైద్య పరీక్షలు, మందులు అందజేసేందుకు నలుగురు వైద్యాధికారులు, 12 మంది పారా మెడికల్ సిబ్బందిని ఆయా పునరాస కేంద్రాలకు డిప్యూటేషన్లపై నియమించామని తెలిపారు. వారంతా మంగళవారం వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకున్నా రని వివరించారు. ఇప్పటికే అక్కడి పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బందికి వీరిని అదనంగా నియమించామన్నారు.




సహాయ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రోషన్..మంత్రి వనితతో కలిసి ఎమ్మెల్యే ఆరిమిల్లి

సహాయక చర్యల్లో మనోళ్లు..

భీమవరం టౌన్ సెప్టెంబరు 3 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సహాయ సహకారాలు అందించేందుకు విజయవాడకు తరలి వెళ్లారు. జిల్లాలోని అన్ని మునిసిపాల్టీల నుంచి ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ పారిశుధ్యం, రెవెన్యూ శాఖల నుంచి సిబ్బంది వెళ్లారు. ఒక్కో మునిసిపాల్టీ నుంచి 60 మందిని తరలించారు. ఇక్కడి నుంచే పారిశుధ్యపనులు నిర్వహించేందుకు అవసరమైన సామగ్రిని కూడా వారు వెంట తీసుకువెళ్లారు. మంచినీటి సరఫరా చేసేందుకు మునిసిపాల్టీల నుంచి ట్యాంకర్లను కూడా విజయవాడ తరలించారు.

తరలివెళ్లిన సిబ్బంది

జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తణుకు నరసాపురం, తాడేపల్లిగూడెం మునిసిపాల్టీల నుంచి కమిషనర్లు, ఏసీపీలు, టీపీవోలు, ఎంఈలు, డీఈలు, ఏఈలతో పాటు పారిశుధ్య కార్మికులతో కలసి 300 మందిని తరలించారని అధికారులు చెబుతున్నారు. అక్కడకి చేరుకున్న అధికారులకు ప్రత్యేక విభాగాలను అప్పగిస్తున్నారు. మునిసిపాల్టీ నుంచి సుమారు 40 మంది చొప్పున పారిశుధ్య కార్మికులను తరలించారు. ఎన్టీఆర్ జిల్లాకు ఏలూరు నుంచి 20 మంది వైద్యాధికారులు, 40 మంది పారా మెడికల్ సిబ్బందిని వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్యసేవల నిమిత్తం పంపించామని డీఎంహెచ్‌వో వివరించారు.

విరాళాలకు సన్నాహాలు

వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు ప్రకటించనున్నారు. దీనికి దాతలు, రాజకీయ పార్టీలు స్పందించనున్నాయి. ఇప్పటికే టీడీపీ నుంచి కూడా మార్గదర్శకాలు అందాయి. తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి రూ.10 లక్షలు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దీనికి అనుగుణంగా నిధులు సేకరించి సీఎం చంద్రబాబుకు చెక్కు రూపంలో అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

టీడీపీ నేతలకు ఇన్‌చార్జి బాధ్యతలు

తణుకు/ చింతలపూడి సెప్టెంబరు 3 : వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యేలను, పార్టీ ముఖ్య నాయకులను ఇన్‌చార్జిలుగా నియమించారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావులను విజయవాడలోని ఒక్కో డివిజన్‌లకు ఇన్‌చార్జిలుగా నియమించారు. విజయవాడలోని 32వ డివిజన్‌లో హోంమంత్రి వంగలపూడి అనితతో కలసి మంగళవారం ఎమ్మెల్యే రాధాకృష్ణ పర్యటించారు.విజయవాడ 44వ వార్డులో వరద సహాయ చర్యల్లో ఎమ్మెల్యే రోషన్ కుమార్ పాల్గొన్నారు. బాధితులకు మంచినీరు, బిస్కెట్లు, పాలు, ఆహార పదార్థాలు అందించారు. భీమవరంలో దాతల సహకారంతో అందించిన 10 వేల ఆహార పొట్లాలతో కోళ్ళ నాగేశ్వరరావు విజయవాడ వెళ్లారు.

తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం అగ్నిమాపక సిబ్బంది సహాయ చర్యల్లో పాల్గొని వరదలో చిక్కుకున్న బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాడేపల్లిగూడెం అగ్నిమాపక అధికారి రామారావు సహాయక చర్యల వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి వివరించారు.



విజయవాడలో సహాయక చర్యలపై సీఎం వివరిస్తున్న ఫైర్ ఆఫీసర్ రామారావు



పులిహోర పొట్లాలను సిద్ధం చేస్తున్న ద్వారకాతిరుమల ఆలయ సిబ్బంది





భీమవరం ఎస్ఆర్‌కెఆర్ నుంచి వాహనానికి జెండా ఊపిన ఎమ్మెల్యే అంజిబాబు.. ఆకివీడులో ప్రారంభించిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు .. బాధితులకు ఆహారాన్ని సిద్ధం చేయిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

మేమున్నామనీ..

మీకేం కాదనీ..

కష్టాల్లో ఉన్నవారికి తోడుగా నిలవాలి..వారికి అండగా మేమున్నామనే భరోసా ఇవ్వాలి.. వరదల్లో ఇల్లు..వాకిలి ఏకమై నిలువ నీడలేక ఇబ్బందులు పడుతున్న బాధితులకు అండగా నిలుస్తున్నారు మనవాళ్లు.. స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, దాతలు అందరూ తలో చేయి వేసి ఆపన్నహస్తం అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి ఆహారం,మందులు పంపుతున్నారు..ఇక్కడి నుంచి విజయవాడ వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.

పశ్చిమ నుంచి లక్షా 25 వేల ఆహార ప్యాకెట్లు

భీమవరం టౌన్, సెప్టెంబరు 3 : విజయవాడ వరద బాధితులకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకారం అందిస్తున్నారు.బాధితులను ఆదుకునేందుకు జిల్లా నుంచి సోమ, మంగళవారాల్లో 1 లక్షా 98 వేల 960 ఆహార పొట్లాలను పంపించారు. దీంతో పాటుగా 70 వేల వాటర్ ప్యాకెట్లు, లక్షా 15 వేల బిస్కెట్లు, వాటర్ బాటిల్స్, రస్కులు, బన్‌లు విజయవాడకు తరలించారు వెస్ట్ గోదావరి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ 9,800, భీమవరం ప్రాన్ ఎక్స్‌పోర్ట్ అసోసియేషన్, చైతన్య గోదావరి 6 వేలు చొప్పున, గాదిరాజు సుబ్బరాజు, తిరుమల కాలేజీ, సంధ్యా మెరైన్స్ దేవదాయ శాఖ, ఎఫ్ఎఫ్‌డీ ఫుడ్ ఫ్యాక్ట్ కంపెనీ 5 వేలు చొప్పున, భీమవరం విష్ణు కాలేజీ, తాడేపల్లిగూడెం నంద్యాల కృష్ణమూర్తి 4 వేలు చొప్పున, ఆకివీడు చాంబర్ ఆఫ్ కామర్స్ 3,500 వేలు, హాట్ లైన్స్ బాబు, కాస్మోకల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ 3 వేలు చొప్పున, ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ 2,500, జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం 2 వేలు ఆహార పొట్లాలను మంగళవారం మధ్యాహ్నం నాటికి పంపారు. మంగళవారం రాత్రి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ 6,700, తాడేపల్లిగూడెం ఎస్‌కె మెరైన్స్ 6 వేలు, తణుకు ఆంధ్రాసుగర్స్ దేవదాయశాఖ 5 వేల చొప్పున, ఇరగవరం వాన్ బెర్రి ఫార్మా కంపెనీ, ట్లక్స్ ఇండస్ట్రీ 4 వేల చొప్పున, లయన్స్ కృష్ణంరాజు, గాదిరాజు సుబ్బరాజు 3 వేల చొప్పున ఆహార పొట్లాలు అందించారు.

భీమవరం ఎడ్యుకేషన్ : విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున 5 వేల ఆహార పొట్లాలను, 1800 రస్కుల ప్యాకెట్లు, 4,500 రష్యన్ బన్ ప్యాకెట్లను అందించినట్లు డైరెక్టర్ స్టూడెంట్స్ అఫైర్స్ అడ్మినిస్ట్రేషన్, డాక్టర్ పి.శ్రీనివాస రాజు తెలిపారు. భీమవరం శ్రీసత్య సాయి సేవాసమితి రాయ ప్రోలు చలపతి బృందం 5 వేల బిస్కెట్ ప్యాకెట్లు, రస్కులు అందించారు. భీమవరం శ్రేయాస్ గ్రాండ్ ఇన్ హోటల్ డైరెక్టర్ యర్రా రాధాకృష్ణ ఆధ్వర్యంలో 5 వేల పులిహోర ప్యాకెట్లు వ్యాన్‌ను ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు.

ఆకివీడు : ఆకివీడులో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఐదువేలు పైబడి బిర్యానీ పొట్లాలతో వెళ్తున్న వాహనానికి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, కార్యదర్శి గుర్రం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కాళ్ళ : కాళ్ళకు చెందిన పారిశ్రామికవేత్త గాదిరాజు సుబ్బరాజు వరద బాధితుల సహాయార్థం ఏర్పాటు చేసిన సుమారు 8 వేల ఆహార ప్యాకెట్లను మంగళవారం ప్రత్యేక వ్యాన్‌లో విజయవాడకు పంపించారు. కాళ్ళ ఇన్‌చార్జి తహసీల్దార్ నాగార్జున, ఆర్ఐ లక్ష్మీకిరణ్, వీఆర్వోలు, పాల్గొన్నారు.



భీమవరంలో పులిహోర ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

ఉండి : ఉండి తహసీల్దారు కార్యలయం నుంచి 6 వేల ఆహార పొట్లాలు తరలించినట్లు తహసీల్దారు నాగార్జున తెలిపారు.

పాలకొల్లు అర్బన్/రూరల్ : పాలకొల్లు రేపాకవారి సత్రం, అత్యం సుబ్బయ్య గారి అన్నసత్రం, కాళ్ళకూరు వేంకటేశ్వర స్వామివారి ఆలయం, గునుపూడి సోమేశ్వర స్వామివారి ఆలయం, పెనుగొండ నగరేశ్వర స్వామి ఆలయాల ఆధ్వర్యంలో 5 వేల బిర్యానీ పొట్లాలను తయారు చేయించి వ్యాన్ ద్వారా పంపించారు.

ఏలూరు జిల్లా నుంచి లక్షా 60 వేల ప్యాకెట్లు

ఏలూరు సిటీ, సెప్టెంబరు 3: ఏలూరు జిల్లా నుంచి వరద సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఏలూరులో గోకుల్ కల్యాణ మండపం, పత్తేబాదలోని కేటరింగ్ సెంటర్లలో అల్పాహారం తయారీ ప్యాకింగ్ పనులన కలెక్టర్ వెట్రిసెల్వి పరిశీలించారు. మంగళవారం మరో లక్షా 60 వేల ఆహార పొట్లాలను ఎన్టీఆర్ జిల్లాకు పంపించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మంగళవారం ఉదయం అల్పాహార ప్యాకెట్లును ప్రత్యేక వాహనాల్లో పంపామన్నారు. మధ్యాహ్నం, సాయంత్రానికి అవసరమైన భోజన ప్యాకెట్లు కూడా సిద్ధం చేసి విజయవాడకు పంపుతున్నట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి , ఆర్డీవో ఖాజావలీ, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ , దెందులూరు తహసీల్దార్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు టూటౌన్ : ఏలూరు ఎమ్మెల్యే బడేటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఆధ్వర్యంలో 40 వేల ఆహార ప్యాకెట్లు తయారు చేసి విజయవాడకు తరలించారు. మంగళవారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనాలకు పంపించాం. బుధవారానికి కూడా ఆహార ప్యాకెట్లు సిద్ధం చేస్తున్నామని మేయర్ తెలిపారు.

పెదవేగి/ పెదపాడు : పెదవేగి మండలం దుగ్గిరాలలోని ఎన్టీఆర్ జనతా క్యాంటీన్‌లో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 50 వేల మందికి సరిపడా ఆహారాన్ని బాక్స్‌ల్లో పెట్టి విజయవాడ తీసుకెళ్ళి వరద బాధితులకు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విజయవాడ 22వ డివిజన్ ఇన్‌చార్జ్‌గా తాను బాధ్యతలను నిర్వర్తిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం 50 వేలమందికి ఆహారాన్ని అందించామని, బుధవారం మరో 50 వేలమందికి ఆహారాన్ని అందించేలా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. పెదపాడు మండలం అప్పనవీడు నుంచి ఆరు వేల ఆహార పొట్లాలను తరలించారు.

ద్వారకాతిరుమల/ జంగారెడ్డిగూడెం : ద్వారకాతిరుమల దేవస్థానం 10,500 పులిహోర ప్యాకెట్లను, 14 వేల మంచినీటి ప్యాకెట్లను రెండు వ్యాన్‌ల ద్వారా విజయవాడకు పంపారు. మద్ది ఆంజనేయస్వామి క్షేత్రం నుంచి 5 వేల పులిహోర ప్యాకెట్లను పంపినట్లు ఈవో కొండలరావు తెలిపారు.

నూజివీడు/ కలిదిండి : మంత్రి కొలుసు పార్థసారథి పిలుపుతో నూజివీడు నాయకులు 3 వేల ఆహార పొట్లాలను విజయవాడ పంపించారు. నూజివీడు డివిజన్ నుంచి సోమ, మంగళవారాల్లో 47 వేల ఆహార ప్యాకెట్లను తయారు చేయించి విజయవాడ తీసుకువెళ్లే వాహనాన్ని ఆర్డీవో వై.భవానిశంకరి జెండా ఊపి పంపారు. కొండంగి గ్రామ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మంగళవారం రెండు వ్యాన్‌లలో 2 వేల ఆహార పొట్లాలు తరలించారు. కలిదిండి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆహార ప్యాకెట్ల వ్యాన్లను తహసీల్దార్ రామకృష్ణ ప్రారంభించారు.



ఏలూరులో వాహనాన్ని పంపుతున్న మేయర్ నూర్జహాన్



భీమవరంలో వాహనంలోకి బ్రెడ్‌లను తరలిస్తున్న విద్యార్థినులు



ఉండిలో ఆహారం తయారు చేయిస్తున్న తహసీల్దారు నాగార్జున, సీఎస్‌డీటీ మహేష్

మనవాళ్లు ఎలా ఉన్నారో..?

వరద ప్రాంతాల్లో ఉన్న వారిపై బంధువుల్లో ఆందోళన

ముదినేపల్లి, సెప్టెంబరు 3 : విజయవాడలో వరదల్లో చిక్కుకున్న తమ వారి యోగ క్షేమాలను తెలుసుకునేందుకు ముదినేపల్లి ప్రాంతంలో ఉన్న వారి కుటుంబీకులు, బంధువులు ఆదుర్దా పడుతున్నారు. విజయవాడలోని సింగ్ నగర్, రామలింగేశ్వర నగర్, ఇబ్రహీంపట్నం, కృష్ణలంక, రామవరప్పాడు బుడమేరు వెంబడి భారీగా వరద వచ్చిన ప్రాంతాల్లో ముదినేపల్లి మండలం వాడవల్లి, పెద గొన్నూరు, శ్రీహరిపురం తదితర గ్రామాలకు చెందిన కుటుంబాలు పెద్ద సంఖ్యలో నివాసం ఉంటున్నాయి. సుమారు 50 కుటుంబాలు రామలింగేశ్వరనగర్‌లో ఉంటున్నారు. ఇళ్లల్లోకి వరదనీరు రావటంతో విజయవాడలో బంధువుల ఇళ్లలో కొందరు తలదాచుకుంటుండగా, మరి కొందరు గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఫస్ట్ ఫ్లోర్‌కు వెళ్లి ఆశ్రయం పొందుతున్నారు. వరద ప్రాంతాల్లో విద్యుత్ లేక సెల్‌ఫోన్లు కూడా పని చేయకపోవటంతో ఇక్కడి వారు మరింత కంగారు పడుతున్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్‌లకు ఫోన్లు చేసి కూడా సమాచారం తెలుసుకుంటున్నారు.

నేడు జరగాల్సిన స్కూల్ గేమ్స్ వాయిదా

పెదవేగి, సెప్టెంబరు 3 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో భాగంగా 4వ తేదీన జరగాల్సిన ఎంపిక పోటీలను వర్షం, వరదల కారణంగా వాయిదా వేశామని అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, పెదవేగి గురుకుల విద్యాలయం పీడీ కందికొండ జయరాజు తెలిపారు. 4వ తేదీన పెదవేగిలోని గురుకుల విద్యాలయంలో బాల, బాలికలకు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, అథ్లెటిక్స్, సెపక్ తక్రా, కుస్తీ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారని 4వ తేదీన జరిగే పోటీలను మాత్రమే వాయిదా వేశామని, మిగిలిన పోటీలు ముందుగా ప్రకటించిన ప్రకారం ఈనెల 6వతేదీ శుక్రవారం నుంచి 21వ తేదీ సోమవారం వరకు యధాతధంగా జరుగుతాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డులతో ఆయా చోట్ల జరిగే పోటీలకు హాజరు కావాలని జయరాజు సూచించారు. 4వ తేదీన జరగాల్సిన పోటీలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియపర్చుతామని తెలిపారు.



సందట్లో సడేమియా..

ఆకివీడు రూరల్/ పెదపాడు : సందట్లో సడేమియాలా వరదనీటిలో చేపలవేట సాగిస్తున్నారు మత్స్యకారులు. ఆకివీడు మండలం దుంపగడప గ్రామ సరిహద్దులో ఉన్న ఉప్పుటేరు రోడ్డు వంతెనపై నుంచి మత్స్యకారులు మంగళవారం వేట సాగించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొల్లేరులోకి భారీగానీరు వచ్చి చేరుతుండటంతో చెరువుల్లోని చేపలు ఉప్పుటేరులోకి వస్తున్నాయని మత్స్యకారులు వల వేస్తున్నారు. సుమారు 4 నుంచి 5 కిలోల చేపలు పడ్డాయి. వాహన దారులు చేపలను కొనుగోలు చేసేందుకు నిలవడంతో వంతెనపై రద్దీ ఏర్పడింది. రామిలేరులో నీటి ఉధృతి తగ్గడంతో కొత్తనీటిలో పైనుంచి వచ్చే చేపల కోసం యువకులు పెద్దఎత్తున వెతుకులాట ప్రారంభించారు. చేపల కోసం గట్టుపై వేచి చూసేవారి సంఖ్య కూడా అలానే ఉంది. పెద్ద చేపలతో పాటు చిన్న పరికె చేపలు కూడా హాట్ కేక్‌ల్లా అమ్ముడుపోయాయి.



క్రైం కార్నర్..



దిరుసుమర్రు రోడ్డులో పంట బోదెలోకి దూసుకెళ్ళిన ప్రైవేటు బస్సు

పంట బోదెలోకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు

భీమవరం క్రైం, సెప్టెంబరు 3 : భీమవరం పట్టణ శివారు దిరుసుమర్రు రోడ్డులో రొయ్యల కంపెనీ కార్మికులు వెలుతున్న ప్రైవేటు బస్సు అదుపు తప్పింది. సుమారు 30 మందితో వెళుతున్న బస్సు స్టీరింగ్ వదిలేయడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న పంట బోదెలోకి దూసుకెళ్ళినట్లు చెబుతున్నారు. బస్సు బోల్తా కొట్టి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేది. దిర్సుమర్రు రోడ్డులో ఎక్కువగా రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలు ఉన్నాయి. ఆ కంపెనీల్లో ఇతర రాష్ట్రాలకు చెందినవారు, భీమవరం చుట్టుపక్కలవారు సుమారు 2 వేలు మందికి పైగా పనిచేస్తున్నారు. కాలం చెల్లిన బస్సులు, వ్యానులు, ఆటోలు ప్రయాణానికి వినియోగిస్తున్నారు. అందువల్ల వారి ప్రాణాలకు రక్షణ లేకుండాపోయింది. అధికారులు స్పందించి వాహనాలకు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. వన్‌టౌన్ సీఐ నాగరాజు మాట్లాడుతూ బస్సు స్టీరింగ్ వదిలివేయడం వల్ల అదుపు తప్పి పంట బోదెలోకి దూసుకెళ్ళిందని ఎవరికీ గాయాలు కాలేదని తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 3 : రైలు పట్టాలు దాటుతున్న ఒక వృద్ధుడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు రైల్వే స్టేషన్ సమీపంలో ఫ్లైవర్ ఓవర్ బ్రిడ్జి కింద ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి గ్రామానికి చెందిన కామిరెడ్డి బుజ్జిరాజు (72) మంగళవారం ఉదయం రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ సైమన్ సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంగాయిగూడెంలో బంగారం చోరీ

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 3 : ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్ళి వచ్చేటప్పటికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని మూడు కాసుల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఏలూరు వంగాయిగూడెం ప్రాంతానికి చెందిన కారెం విజయ గత నెల 28వ తేదీన తన ఇంటికి తాళం వేసి దుగ్గిరాలలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్ళారు. ఆమె తిరిగి ఈనెల 2వ తేదీ రాత్రి వచ్చారు. ఇచ్చేటప్పటికి ఇంట్లోని బీరువా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న మూడు కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ మదీనా బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాందువ్వ వినాయకుడి గుడిలో హుండీ చోరీ



ఉండి సెప్టెంబరు 3: ఉండి మండలం పాందువ్వ గ్రామంలోని వినా యకుడి ఆలయంలో సోమవారం రాత్రి దొంగలు ప్రవేశించి హుండీలో నగదు దొంగిలించారు. సుమారు లక్ష రూపాయల వరకు నగదు వుంటుందని ఆలయ కమిటీవారు అంటున్నారు. వినాయకుడి గుడి తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించి హుండీని తెరచి అందులోని నగదు చోరీ చేశారు. మరో నాలుగు రోజుల్లో వినాయక చవితి పండుగకు సిద్ధం కానుండగా చోరీకి గురికావడంపై కలకలం రేగింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారి విచ్చేసి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్..రూ.10 వేలు జరిమానా

భీమవరం క్రైం, సెప్టెంబరు 3 : గత నెల 31న భీమవరం వన్‌టౌన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భీమవరం మండలం యనమదుర్రు గ్రామానికి చెందిన జోగి నవీన్ మద్యం సేవించి వాహనం నడుపుతుండగా నిర్థారణ అయింది. అతనిని భీమవరం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రాజారావు వద్ద హాజరుపరచగా రూ.10 వేలు జరిమానా విధించారని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగరాజు తెలిపారు.

భీమవరంలో చేపల వ్యాపారి మోసం

సుమారు రూ.10 కోట్లకు పైగా రైతులకు ఎగనామం

భీమవరం క్రైం, సెప్టెంబరు 3 : భీమవరం పట్టణంలో ఒక చేపల వ్యాపారి, వైసీపీ నాయకుడు చేపల రైతులకు సుమారు రూ.10 కోట్లు వరకు బాకీ ఉండటంతో బాధితులు మంగళవారం వ్యాపారి ఇంటి వద్ద ఆందోళనకు దిగినట్టు సమాచారం. వివరాల్లోకి వెళితే ఫైర్ స్టేషన్ సమీపంలో నివాసం ఉండే వైసీపీ నాయకుడు కొన్నేళ్ళుగా చేపల వ్యాపారం చేస్తున్నారు.గతంలో ఒక ప్రజాప్రతినిధి అండదండలతో రైతుల సొమ్ములు సుమారు రూ.6 కోట్ల వరకు ఎగ్గొట్టాడు. ఎవరైనా గట్టిగా అడిగితే బెదిరించేవాడు. అదలా ఉంటే మళ్లీ సుమారు రూ.8 కోట్లు వరకు రైతులకు బకాయిలు ఉండగా తప్పించుకుని తిరుగుతున్నట్లు చెబుతున్నారు. మంగళవారం ఆ వ్యాపారి ఇంటి వద్ద కొందరు ఆందోళన చేస్తుండగా పోలీసులు రంగ ప్రవేశం చేశారు. భీమవరంలో మరో రొయ్యల వ్యాపారి ఎగనామం పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. బాధితులు అతని చుట్టూ తిరుగుతూ ఉన్నా కూడా ఫలితం లేకుండా పోయిందని చెబుతున్నారు. దీనిపై వన్‌టౌన్ సీఐ నాగరాజును వివరణ కోరగా డబ్బులు ఇవ్వకుండా ఒక వ్యక్తి మోసం చేసినట్లుగా కొంతమంది ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చారని పూర్తి వివరాలు సేకరిస్తున్నామని సీఐ తెలిపారు.

30 లీటర్ల సారా స్వాధీనం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 3 : ద్వారకాతిరుమల మండలం ఐఎస్ రామానుజపురంలో నిర్వహించిన ఎక్సైజ్ దాడుల్లో 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ గిరిజాకుమారి తెలిపారు. ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రామానుజపురంలో దాడులు నిర్వహించగా వీరమల్లు వెంకటేశ్వరరావు అనే వ్యక్తి దగ్గర సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ వెంకటలక్ష్మి, సిబ్బంది పిలిప్స్, ప్రసాద్ పాల్గొన్నారు.

అదనపు కట్నం కేసు నమోదు

భీమవరం క్రైం, సెప్టెంబరు 3 : తన భర్త, అత్తమామ, ఆడపడుచు, అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ భీమవరం మండలం అనాకోడేరు పంచాయతీ ఈలంపూడి గ్రామానికి చెందిన ఇళ్ళ లక్ష్మీ రూరల్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. లక్ష్మీకి అదే గ్రామానికి చెందిన సత్యనారాయణతో 2018లో వివాహమైంది.3 లక్షలు కట్నంగా ఇచ్చారు. కొంత కాలంగా అదనంగా కట్నం తీసుకురమ్మని వేధిస్తుండటంతో ఫిర్యాదు చేశారు.

శాశ్వత ముంపు నివారణకు చర్యలు


సహాయక పనులను సమీక్షిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదపాడు, సెప్టెంబరు 3 : వరద ముంపు బారినపడి తీవ్రంగా నష్టపోయిన అప్పనవీడు, తాళ్లమూడిలోని ఎస్సీ కాలనీ, జగనన్న కాలనీల్లో శాశ్వత ముంపు నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోనున్నట్లుగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ముంపు బారినపడ్డ ఆయా ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. వరద ఉధృతిని తగ్గించేందుకు ఏర్పాటు చేసిన గండ్లు, పూడిక పోయిన కల్వర్టులను పరిశీలించారు. ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లో నాయకులు, అధికారులు అందుబాటులో ఉంటారని, ఎవ్వరూ అధైర్యప డవద్దని కాలనీ వాసులకు ధైర్యం చెప్పారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

చైల్డ్ కేర్ సంస్థల్లో తనిఖీలు


దీవెన చిల్డ్రన్ హోమ్ వద్ద అధికారులు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 3 : జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో రిజిష్టర్ అయిన ఐదు చైల్డ్ కేర్ సంస్థల్లో బాలల సంరక్షణ శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. బాల, బాలికలకు అందుతున్న వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. జువైనల్ జస్టీస్ యాక్ట్‌లో ఉన్న నియమ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని నిర్వాహకు లకు సూచించారు. ఆదరణ లేని బాల బాలికలకు వసతి గృహాలు నడిపే ప్రతీ ఒక్కరూ జువైనల్ జస్టీస్ యాక్ట్ 2015 సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకో వాలని తెలిపారు. చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ కన్వీనర్ జె.దుర్గాప్రసాద్, కో కన్వీనర్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్య చక్రవేణి, సభ్యులు సీడీపీఓ పి.బ్యూలా, శ్రీకాంత్, లీగల్ అధికారి సి.జాహ్నవి పాల్గొన్నారు.

దొండ సాగు రైతుల ఆందోళన


దొండ పందిళ్లను పరిశీలిస్తున్న రైతు సంఘ నేతలు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 3: నష్టాల్లో ఉన్న దొండ రైతులకు ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని పంగిడిగూడెంలో మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో దొండ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా సంఘనేతలు దొండ పందిళ్లను పరిశీలించారు. వైరస్, తెగుళ్ల సోకి దొండపంటకు అపారనష్టం సంభవించిందన్నారు. కె.భాస్కరరావు, జి.రాంబాబు, పి.శ్రీనివాసరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే శిశువుకు ఆరోగ్యం

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 3 : తల్లిగర్భంలో ఉన్న శిశువును శబ్దాల ద్వారా ఉత్తేజం చేయవచ్చునని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కేపీవీఎల్ పద్మావతి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ ఒకటి నుంచి 30వ తేదీ వరకూ ఏడు రకాల అంశాలపై వివిధ రకాల కార్యక్రమాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. ఏలూరు రెహమాన్‌నగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం మాసోత్సవాల కార్యక్రమాలు ఏర్పాటు చేయగా వాటిని ప్రాజెక్టు డైరెక్టర్ పద్మావతి ప్రారంభించారు. ఈవో మల్లిక, సూపర్‌వైజర్ ఎండీ మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.నవతి, కె.రూసీ లక్ష్మీ పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 3 : వినాయక చవితి విగ్రహాలను ఏర్పాటు చేసేవారు ముందస్తుగా సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు పొందాలని ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ సూచించారు. వినాయకచవితి ఉత్సవ కమిటీ సభ్యులతో వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. నిమజ్జనం ఎప్పుడు చేసేది రూటు మ్యాప్‌ను పోలీసులకు అందించాలన్నారు. ఉదయం ఆరు నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే లవుడ్ స్పీకర్లు వినియోగించాలన్నారు. పెద్ద విగ్రహాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. వన్‌టౌన్ ఎస్‌ఐ మదీనా బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జీలుగుమిల్లి, సెప్టెంబరు 3 : ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పంటలు దెబ్బతినకుండా రైతులు తగు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.గంగాధర్ సూచించారు. స్వర్ణవారిగూడెంలో వరి పంటల్ని రెవెన్యూ అధికారులతో కలసి ఏవో మంగళవారం పరిశీలించారు. వరి పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. చీడ పురుగుల నివారణకు ఎకరాకు 400గ్రా. కార్బండిజ మ్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎస్.ప్రసాద్, వీఆర్వో ఎం.కుమారస్వామి, వీఆర్ఏ చంద్రశేఖర్, డి.రమేష్‌కుమార్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఉంగుటూరు :** గ్రామానికి చెందిన దాత మందా శ్రీనివాసరెడ్డి దాతృత్వంతో మంగళవారం వంద మంది పిల్లలకు పాస్‌లు అందించారు. హెచ్ఎం వి.విజయ కుమార్, తాడేపల్లిగూడెం డిపో పీఆర్వో డి.విజయకుమార్ పాల్గొన్నారు.
- **ద్వారకాతిరుమల :** పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా జి.కొత్తపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం రైటింగ్ ప్యాడ్స్ , మిఠాయి లు, ఆపిల్, బత్తాయి కల్గిన ప్యాకెట్లను అందజేశారు.
- **కామవరపుకోట :** ఆడమిల్లికి చెందిన ఎన్ఆర్ఐ పి.సతీష్‌కుమార్ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల 40 రకాల పుస్తకాలను మంగళవారం అందజేశారు. ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, వి. మధు, తదితరులు పాల్గొన్నారు.
- **టి.నరసాపురం :** డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మధ్యాహ్నంవారిగూడెంలో జనసేన నాయకులు జట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం 50 మంది వృద్ధులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.
- **జంగారెడ్డిగూడెం :** డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పుట్టిరోజు సందర్భంగా వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా నగ ర్ కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాల విద్యార్థులు 60 మందికి రూ.15 వేల విలువ చేసే డ్రై ఫ్రూట్‌లను దాత జి.దుర్గాదేవి సహకారంతో మంగళవారం అందిచేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు వి.తాతాజీ తెలిపారు.
- **లింగపాలెం :** వర్షాలు ఎక్కువగా కురుస్తుండడంతో తమ్మిలేరు పరివాహక ప్రాంతాలైన యడవల్లి, కొణిజర్ల, తువ్వచిలుకరాయుడుపాలెం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నజీముల్లాషా సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో నెంబరు 94910 41452కు ఫోన్ చేయాలన్నారు.
- **బుట్టాయగూడెం :** తెలుగు రాష్ట్రాల్లో సంభవించిన తుపాను నష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి యుద్ధ ప్రాతిపదికన సహాయం అందించాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కోరారు. ఇందుకు సంబంధించిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధాని మోదీని, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్‌షాలను కలిసి చర్చలు జరపాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదుకు

టీచర్ల హైరానా !

- చివరి నిమిషంలో దరఖాస్తులతో కార్యాలయాల వైపు పరుగులు
- గడువు పొడిగించాలని అభ్యర్థనలు


డీఈవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా నాయకులు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 3 : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు నిమిత్తం దరఖాస్తుల అందజేత విషయంలో ఒకింత గందరగోళం నెలకొంది. దరఖాస్తుల అందజేతకు మంగళవారం గడువు ముగియగా, చివరి రోజు పలు అభ్యంతరాల వల్ల దరఖాస్తులను అందజేయలేకపోయామని కొందరు ఉపాధ్యాయులు అంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగించుకునేందుకు దరఖాస్తులను తొలుత టీచరు పనిచేస్తున్న హైస్కూలులో ప్రధానోపాధ్యాయునికి అందజేసి, అప్రూవల్ తర్వాత సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని జిల్లా అధికారులు కొద్దిరోజుల క్రితం ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలో పలువురు టీచర్లు మంగళవారం హెచ్ఎం ఆమోదించిన దరఖాస్తులను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అందజేసేందుకువెళ్ళగా, అక్కడ వారికి భిన్న సమాధానం రావడంతో అవాక్కయ్యారు. అసెంబ్లీ నియోజకవర్గం ఓటువున్న చోట దరఖాస్తులను అందజేయాలని సూచించడంతో అక్కడకు వెళ్ళారు. తీరా అక్కడకువెళ్ళాక ఆధార్ కార్డులో చిరునామా ఉన్న మండల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని అక్కడి అధికారులు చెప్పడంతో మళ్ళీ సంబంధిత కార్యాలయానికి వెళ్ళేసరికి దరఖాస్తులు స్వీకరించడానికి నిర్ణీత సమయం ముగిసిందనడంతో అయోమయంలో పడ్డారు. ఈ పరిస్థితి లింగపాలెం, దెందులూరు, ఏలూరు మండలాల్లో పనిచేసే పలువురు టీచర్లకు మంగళవారం ఎదురైంది ఈ నేపథ్యంలో దరఖాస్తుల అందజేతకు కనీసం మరో మూడురోజులైనా గడువును పొడిగించాలని, ఆ దిశగా ఎన్నికల కమిషన్ స్థానిక అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఉపాధ్యాయులు అభ్యర్థిస్తున్నారు. దీనిపై ఏలూరు తహసీల్దార్ శేషగిరిని వివరణ కోరగా 'తుది గడువు ముగిసే సమయం వరకు ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు దరఖాస్తులను స్వీకరించాం. ఎవరివీ తిరస్కరించలేదు. గడువులోగా దరఖాస్తులు అందజేయాలని ఎప్పటి నుంచో చెబు తున్నాం. ఇంకా ఎవరికైనా దరఖాస్తులుంటే తీసుకోవాలని ఎన్నికల కమిషన్ ఆదేశిస్తే స్వీకరిస్తాం.' అని వివరించారు.

గడువు పొడిగించాలని అభ్యర్థన

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల నమోదుకు గడువును కనీసం నెల రోజులైనా పొడిగించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్‌ముస్తఫాఅలీ, రవికుమార్ ఓ ప్రకటనలో అన్నారు. కొద్దిరోజులుగా విద్యాశాఖ నిర్వహిస్తోన్న వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో టీచర్లు ఒత్తిడిలో ఉన్నందున గడువు పొడిగించాలని కోరారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు రెండింటికీ కలిపి ఒకేసారి ఎన్నికలు నిర్వహించేలా షెడ్యూలును ఎన్నికల కమిషన్ సవరించే విషయాన్ని పరిశీలించాలన్నారు.

డీఈవోకు పీఆర్టీయూ వినతిపత్రం

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు నమోదుకు దరఖాస్తు అందజేత గడువును పొడిగించాలని అభ్యర్థిస్తూ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలోని ఉపాధ్యాయ బృందం డీఈవో అబ్రహంకు వినతి పత్రాన్ని అందజేసింది. కనీసం మరో నెలరోజులపాటు గడువును పొడిగించేందుకు కలెక్టర్ ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్ళే విషయాన్ని పరిశీలించాలని కోరారు.

టీపీవో ఉద్యోగంలో చేరకుంటే..


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 3 : మున్సిపాలిటీని రోల్ మోడల్ తీర్చిదిద్దుతానని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మున్సిపల్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ జె.నరేంద్రకుమార్ విధి నిర్వహణపై విజయవాడ వరద ప్రాంతానికి వెళ్లగా కార్యాలయ మేనేజరు వెంకటరమణ ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. మున్సిపాలిటీకి వచ్చే నాలుగు రకాల ఆదాయాలపై కూటమి నాయకులను కమిటీలుగా వేశారు. టీపీవో ఉద్యోగంలో చేరకపోతే వేరొకరిని నియమిస్తామన్నారు. రివ్యూ సమావేశం పూర్తి కాకముందే విజయవాడ వరద ప్రాంతంలో 44వ వార్డులో సహాయక చర్యలను పర్యవేక్షించాలని టీడీపీ కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో ఆయన సమావేశాన్ని ముగించుకుని వెళ్ళిపోయారు. తహసీల్దారు కె.స్లీవజోజి, ఎంపీడీఓ కేవీ ప్రసాద్, కౌన్సిలర్లు ఎన్.రామచంద్ర రాజు, కె.రమాదేవి, టి.జ్యోతి, కూటమి నాయకులు ఆర్.కృష్ణ, పి.సత్తిపండు, ఎం.ఈశ్వరయ్య, డి.శ్యామ్ చంద్రశేష, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.విఘ్నేష్ వినతిపత్రం సమర్పించారు. పట్టణంలో పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో ఉన్న అనేక సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు విఘ్నేష్ తెలిపారు.

మానసిక ఉల్లాసంతో జీవించాలి

లింగపాలెం, సెప్టెంబరు 3: యువత శారీరక వ్యాయామం చేయటం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెంలో జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యాయామం చేసే పనుల్లోనే ఉంటుందన్నారు. అనంతరం యువతతో పాటు వ్యాయామం చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు జి.నాగబుద్ధవరప్రసాద్, కేఎస్‌వీ ప్రసాద్, రామ్మోహన్‌రావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు 4స్టార్ గృహ అవార్డు


అవార్డును చూపుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పెదవేగి, సెప్టెంబరు 3 : పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ) 4 స్టార్ గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హాబిటాట్ అసెస్మెంట్ (గృహ) అవార్డు అందుకుంది. గృహ సంస్థ శక్తి, వనరుల సంస్థ, భారత ప్రభుత్వంలోని కొత్త, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖలతో కలసి, పలు విద్యా సంస్థల్లో పునరుత్పాదక శక్తిని సద్వినియోగపర్చడం, జల నిర్వహణ-సంరక్షణ, వ్యర్థాల నిర్వహణ వంటి 16 అంశాల్లో జరిపిన సర్వేల ద్వారా పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయానికి 4స్టార్ రేటింగ్‌ను ఇస్తూ అవార్డును ప్రదానం చేసిందని విద్యాలయ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. గత నెల 30న హైదరా బాద్‌లో జరిగిన కార్యక్ర మంలో జేఎన్వీ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు వి.రంజిత్‌కుమార్‌కు నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియ న్ డిప్యూటీ కమిషనర్ అవార్డును అందించారని ఆమె చెప్పారు. పెదవేగి జేఎన్వీకి గృహ అవార్డు లభించడం ఉమ్మడి పశ్చిమ గోదా వరి జిల్లాకు గర్వకారణమని, ఈ అవార్డుతో మా బాధ్యత మరింతగా పెరిగిందని ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి తెలిపారు. జేఎన్వీకి 4స్టార్ రేటింగ్ రావడంలో కీలకంగా వ్యవహరించిన సభ్యులను ఆమె అభినందించారు. విద్యాలయ ప్రతినిధిగా హాజరై, అవార్డు అందుకోవడం సంతోషాన్నిచ్చిందని జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రంజిత్ కుమార్ తెలిపారు.

నేత్ర దానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి


కొయ్యలగూడెం నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్తేరురాణి

కొయ్యలగూడెం, సెప్టెంబరు 3: నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కొయ్యలగూడెం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్తేరురాణి, నేత్ర వైద్యులు సీహెచ్ చక్రవర్తి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. సీహెచ్ నాగమణి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం : వింజరం పీహెచ్‌సీలో ప్రపంచ నేత్రదాన పక్షోత్సవాలు వైద్యాధికారి మురళీధర్ ఆధ్వరంలో జరిగాయి. వైద్యుడు నిఖిల్ నేత్రదానం అవశ్యకతపై అవగాహన కల్పించారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


కామవరపుకోటలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

కామవరపుకోట, సెప్టెంబరు 3 : ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వాలు తీసుకోవాలని మండల సీపీఐ కార్యదర్శి టీవీఎస్ రాజు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక చైతనా సెంటర్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని, అర్హులందరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. నాయకులు జి.దుర్గారావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం : అధిక ధరలు అరికట్టాలని మండల సీపీఐ కార్యదర్శి జమ్మి శ్రీనివాస్ కోరారు. దిప్పకాయలపాడు, మంగపతిదేవిపేట గ్రామ సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. జి.శ్రీను, మచ్చయ్య పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్ : ప్రజా సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ పిలుపు మేరకు ఏలూరు జిల్లాలో ఆందోళనకు సిద్ధమైనట్టు సీపీఐ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. స్ఫూర్తి భవనం వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర ధరలు తగ్గించాలని, ధరల స్థిరీకరణకు బడ్జెట్‌లో తగు నిధులు కేటాయించి సక్రమంగా వినియోగించాలని కోరారు. జనాభా గణన నిర్వహించి ప్రజలందరికీ సేవలు అందించాలని కోరారు.

సోషల్ ఆడిట్ ప్రజావేదిక 11కు వాయిదా

భీమడోలు, సెప్టెంబర్ 3 : మండలంలో బుధవారం జరగాల్సిన 17వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం వరదలు కారణంగా వాయి పడినట్లు ఎంపీడీవో పద్మావతి తెలిపారు. ఈ నెల 11న సమావేశం నిర్వహిస్తామన్నారు.

వరద బాధితులకు సాంబార్ రైస్


విజయవాడ సున్నంబట్టీ కమ్యూనిటీ హాల్ వద్ద బాధితులకు అందించిన ఆహారం, నీరు

చింతలపూడి, సెప్టెంబరు 3: పట్టణానికి చెందిన కొందరు దాతల సహకారంతో విజయవాడ వరద బాధితులు 700 మందికి సాంబార్ రైస్, వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లను సున్నంబట్టీ కమ్యూనిటీ సెంటర్లో అందచేసినట్లు టి.వరప్రసాద్ తెలిపారు.

శాంతించిన వరుణుడు


ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు

ఏలూరు రూరల్, సెప్టెంబరు 3 : రెండు రోజులుగా వణికించిన వానలు మంగళవారం తెరిపిచ్చాయి. అక్కడక్కడ కొద్దిపాటి నష్టాలు జరిగాయి. రహదారులు అధ్వా నంగా తయారయ్యాయి. సాగులో ఉన్నపైర్లకు మేలు చేకూరింది. మిగతా పంటల సాగుకు ఊతం లభించింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఊరట చెంది, రోజువారీ పనుల్లో నిమగ్నమయ్యారు. ఏలూరు రూరల్ మండలంలో సాగుకు ఉపకరించేలా వర్షాలు పడ్డాయి. ఇప్పటికే పొలంలో ఉన్న పైర్లు తాజా వర్షాలతో కళకళలాడుతున్నాయి. అలాగే తమ్మిలేరుకు వరద నీరు తగ్గుముఖం పట్టినా కొల్లేరు గ్రామాలైన గుడివాక లంక వద్ద మాత్రం వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏలూరు ఎంపీడీవో బండి ప్రణవి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాస్, అటవీ శాఖ అధికారులు మంగళవారం ఉదయం వరద పరిస్థితిని పరిశీలించారు. ప్రస్తుతం వరద ప్రవాహం నిలకడగా ఉండడంతో కొల్లేరు ప్రాంతాలైన మొండికోడు, గుడివాకలంక గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ఏలూరు కార్పొరేషన్‌లో.. మరో వికెట్ డౌన్

ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 3 : ఏలూరు నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు గురునాధ్ జాన్ తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లిఖిత పూర్వకంగా రాసి నగర కమిషనర్‌కు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని ముఖ్య అనుచరుడుగా గురునాధ్ గుర్తింపు పొందాడు. నాని రాజీనామాతో ఎటూ పాలుపోని పరిస్థితుల్లో రాజీనామా చేశారు.

డిప్యూటీ కమిషనర్‌గా శివారెడ్డి బాధ్యతల స్వీకరణ

ఏలూరు టు టౌన్, సెప్టెంబరు 3 : నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా శివారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కొన్ని రోజులుగా డిప్యూటీ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది. డీసీగా పనిచేసిన దివ్యకుమారి బదిలీపై తాడేపల్లిగూడెం మున్సిపాలిటీకి సెక్రటరీగా వెళ్ళారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న శివారెడ్డి డీసీగా నియమితులయ్యారు.

జాబ్‌మేళాలో 40 మందికి ఉద్యోగాలు

ఏలూరు అర్బన్/బుట్టాయగూడెం, సెప్టెంబరు 3 : ఏలూరు ప్రభుత్వ ఐటీఐలో, బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన మినీ జాబ్ మేళాకు మొత్తం 148 మంది నిరుద్యోగ యువత హాజరుకాగా, వీరిలో 40 మంది వివిధ కంపెనీల్లో ఉపాధి పొందారని ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా అధికారి జి.సుధాకర్ ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపాల్స్ రజిత, జి.కుసుమ సంజీవని, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మధుభూషణరావు, జిల్లా ప్లేస్మెంట్ అధికారి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన..

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 3 : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వపరంగా అన్ని చర్యలు తీసుకున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వి.వరలక్ష్మి మంగళవారం తెలిపారు. తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ 2024 ఆఖరుకి 45 వేల 51 మంది నిరుద్యోగులు నమోదు చేసుకున్నారని, అందులో 31 వేల 95 మంది పురుషులు, 13 వేల 956 మంది మహిళలు ఉన్నారన్నారు. ఈ ఏడాది తమ కార్యాలయంలో 21 జాబ్‌మేళాలు నిర్వహించి 395 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని స్పష్టం చేశారు.

40 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ?

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 3 : గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 5న ఏలూరు జడ్పీ మీటింగ్ హాలులో నిర్వహిస్తున్నారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను సుమారు 40 మందికి అందజేసే అవకాశం ఉంది. ఈ అవార్డులకోసం అందిన దరఖాస్తుల పరిశీలన, వడపోత ప్రస్తుతం జరుగుతోంది. పురస్కారాలకు ఎవరెవరు ఎంపికైందీ బుధవారం అధికారికంగా ప్రకటిస్తామని జిల్లా విద్యాశాఖవర్గాలు వెల్లడించాయి.

ముగిసిన నాక్ పీర్ కమిటీ పరిశీలన

ఉంగుటూరు, సెప్టెంబరు 3 : నారాయణపురం శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన నాక్ పీర్ కమిటీ పరిశీలన మంగళవారం ముగిసింది. కమిటీ సభ్యులు మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కళాశాలలో మానవీయ విలువలు, పచ్చదనం పరిశుభ్రత, సమాజాభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలపై వివిధ కమిటీలతో ఇంటరాక్షన్ అయ్యారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్, రెడ్ రిబ్బన్, ఎకో క్లబ్ తదితర విభాగాల పనితీరు, భౌతిక అంశాలను పరిశీలించి తుది నివేదిక సీల్డ్ కవర్‌లో ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావుకు వీడ్కోలు కార్యక్రమంలో నాక్ కమిటీ సభ్యులు ఎన్‌వీఆర్ జ్యోతి కుమార్, మీనాక్షి వైకోలే అందజేశారు. దీంతో గతంతో వచ్చిన (బి, గ్రేడ్)ర్యాంకు కంటే మంచి ర్యాంకు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

డ్రైవర్స్ కార్యవర్గం ఎన్నిక

చింతలపూడి, సెప్టెంబరు 3: స్థానిక మార్కెటింగ్ యార్డు ఆవరణలో మండలంలోని ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల బస్సు డ్రైవర్ల యూనియన్ నూతనంగా ఏర్పడింది. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భగత్‌సింగ్ ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల బస్సు డ్రైవర్ యూనియన్‌గా నామకరణం చేశారు. అనంతరం జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో గౌరవాధ్యక్షులుగా ఎస్.వెంకటేశ్వరరావు, సలహాదారుడిగా సీహెచ్ రమణ, అధ్యక్షులుగా ఎ.మధు, కార్యదర్శిగా ఎం.రవికుమార్, కోశాధికారిగా నాగబాబు, ఉపాధ్యక్షుడిగా బాపనయ్య, సహాయ కార్యదర్శిగా సర్వేశ్వరరావు, మరో నలుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

రూ.5 లక్షల విరాళం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 3: ఏలూరు గుత్తా ఫౌండేషన్ చైర్మన్ మడుపల్లి మోహన్‌గుప్తా వరద బాధితులకు ఆహారం, అల్పాహారం, వాటర్ బాటిల్స్ పంపిణీ చేసేందుకు రూ.ఐదు లక్షల విరాళాన్ని హరేకృష్ణ మూమెంట్ ట్రస్ట్‌కు అందజేశారు. ఏలూరు గుత్తా ఫౌండేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మోహన్‌గుప్తా సతీమణి, మల్లీశ్వరి చేతులమీదుగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా విజయవాడలోని వరద బాధితులకు ఆహారం, హరేకృష్ణ సంస్థ అందజేసింది. సంస్థ ఆడిటర్ సుబ్బారావు, మేనేజరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ.50 వేలు విరాళం ప్రకటన

ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 3: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాపు సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్‌లకు రూ.50 వేలు విరాళం ఇస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు పూజారి నిరంజన్ తెలిపారు. విరాళాన్ని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్యలకు అందజేస్తామని ప్రకటించారు. చాటపర్రురోడ్డులోని జనసేన కార్యాలయంలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. సీనియర్ నాయకులు జి.వెంకటకృష్ణ కేక్ కట్ చేశారు. పి.శ్రీరాములు, ఎం.చంద్రశేఖర్, వి.రాజు, ఎన్.ధానభాస్కర్, ఎ.భాస్కర్, సతీష్‌నాయుడు, జ్యోతికుమార్, శేషగిరి పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వాల నమోదు వేగవంతం

జీలుగుమిల్లి, సెప్టెంబరు 3 : భారతీయ జనతా పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం వేగవంతం చేస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్ అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కె.ప్రసాద్ ఇంటి వద్ద మంగళవారం పార్టీ సభ్యత్వాలు సెల్ ఫోన్‌ల ద్వారా నమోదు చేశారు. నాయకులు పి.వెంకటసుబ్బారెడ్డి, బి.శివరామకృష్ణ, కె.సాయి, జి.రాంబాబు ఉన్నారు

జీతాలు పెంచాలని ఆశ వర్కర్ల ఆందోళన

కుక్కునూరు, సెప్టెంబర్లు 3 : తమకు జీతాలు పెంచాలంటూ ఆశా వర్కర్లు మంగళవారం ఆందోళనకు దిగారు. ఆశ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో కుక్కునూరు, అమరవరం మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆందోళన చేసి వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి సాయికిరణ్, రాజేశ్వరి, శ్రావణి, రమణా, తులసి పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పునరావాసం కల్పించాలి

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 3 : భారీ వర్షాలు ప్రజా జీవితాన్ని అతలాకుతలం చేశాయని బాధిత కుటుంబాలకు యుద్ధ ప్రాతిపదికన పునరావాసం కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్కే బాషా మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరద నీరు పంట పొలాల్లో చేరి ముంచెత్తిందన్నారు. నష్టపోయిన రైతాంగాన్ని అన్ని విధాలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

షార్ట్ ఫిలిమ్స్ వివాదం.. బంధించి చిత్రహింసలు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 3 : ఇంటికి రమ్మని ఇంట్లో బంధించి తాళ్ళతో కట్టేసి చిత్రహింసలకు గురిచేసిన నలుగురిపై ఏలూరు రూరల్ పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఏలూరు గులాబీ తోటకు చెందిన షేక్ అహ్మద్ రియాజ్ షార్ట్ ఫిలిమ్స్ తీస్తుంటాడు. ఈ నేపథ్యంలో చాటపర్రు రోడ్డుకు చెందిన నున్నాబత్తుల కిషోర్, ముంగర దుర్గ, అయ్యప్పసాయి అనే వ్యక్తులు పరిచయమయ్యారు. షార్ట్ ఫిలిమ్‌లో వీరిని యాక్టర్లుగా పెట్టాడు. గత నెల 26వ తేదీ రాత్రి నున్నాబత్తుల కిషోర్, షేక్ అహ్మద్ రియాజ్‌కు ఫోన్ చేసి తమ ఇంటికి రావాలని చెప్పడంతో స్నేహ పూర్వకంగానే ఇంటికి వెళ్ళాడు. డబ్బుల విషయంలో వివాదం తలెత్తడంతో అతడిని ఆ నలుగురు కలిసి కట్టేసి చిత్రహింసలకు గురిచేశారు. దీంతో బాధితుడు మంగళవారం రాత్రి ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు. కిషోర్, దుర్గ, అయ్యప్పసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తన భార్యకు వీడియో కాల్ చేశాడని..

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 3 : తన భార్యకు వీడియో కాల్ చేస్తున్నాడనే అనుమానంతో కిరాయి వ్యక్తులను పెట్టి ఒక యువకుడిని గదిలో నిర్బంధించి చిత్రహింసలకు గురిచేసిన ముగ్గురిపై మంగళవారం ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు కండ్రికగూడానికి చెందిన అరవింద్ అనే యువకుడికి ఏలూరు చాటపర్రు రోడ్డులో నివాసముంటున్న సతీష్ అనే వ్యక్తి స్నేహితుడు. సతీష్ భార్యకు అరవింద్ తరచుగా వీడియో కాల్ చేస్తున్నాడని అనుమానపడి తన ఇంటికి రావాలని అరవింద్‌కు ఫోన్ చేసి రప్పించాడు. కొట్టి ప్రశాంత్ కుమార్ మరో ముగ్గురు వ్యక్తులతో అరవింద్‌ను నిర్బంధించి చిత్రహింసలకు గురి చేయించాడు. బాధితుడు ఏలూరు రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొట్టి ప్రశాంత్‌కుమార్ అలియాస్ మున్నా, సతీష్, మరో ఇద్దరిపై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరం పై దాడి

కొయ్యలగూడెం, సెప్టెంబరు 3: అరిపాటిదిబ్బల వద్ద మంగళవారం పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో తమ సిబ్బంది దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారని ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. ఏడు వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

12 మంది పై పరస్పర కేసులు నమోదు

టి.నరసాపురం, సెప్టెంబరు 3: భూ వివాదంలో చోటుచేసుకున్న ఘటనలో 12 మంది పై రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వి.జయకుమార్ మంగళవారం తెలిపారు. వెలగపాడు గ్రామానికి చెందిన చింతపల్లి రాంబాబుకు చెందిన ఎకరా 70 సెంట్ల భూమిని ఏలూరు సీనియర్ సివిల్ జడ్జి వేలం వేయగా వేలం లోఅదే గ్రామానికి చెందిన బోయిన అంజిబాబు తల్లి గంగమ్మ కొనుగోలు చేసిందన్నారు. ఆ పొలాన్ని ఆగస్టు 28న రెవెన్యూ అధికారులు స్వాధీనం చేశారన్నారు. ఈ క్రమంలో ఆగస్టు 29 మధ్యాహ్నం పొలంలోకి వెళ్లగా అప్పటికే అక్కడ ఉన్న చింతపల్లి రాంబాబు మరో నలుగురు పొలంలోకి వస్తే చంపుతామని బెదిరించి బీరు సీసాతో తలపై కొట్టారని గాయాలపాలైన అతడిని చింతలపూడి ప్రభుత్వా స్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారని ఆస్పత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీ సులు తెలిపారు. కాగా వెలగపాడుకి చెందిన చింతపల్లి సుబ్బారావుకు తన తండ్రి ఇచ్చిన ఎకరం 70 సెంట్ల భూమిని సాగు చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన చింతపల్లి అంజిబాబు మరో ఆరుగురు పొలాన్ని దున్నించటానికి వచ్చారని ప్రశ్నించిన సుబ్బారావు పై ఇనుప రాడ్లు, కర్రలతో దాడిచేయగా గాయ పడిన అతనిని చింతలపూడి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై కేసు

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 3 : స్థానిక బాట గంగానమ్మ గుడి లేఅవుట్ కాలనీ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న ఆంద్రు పెద్దరాజు పై దాడి చేసి అతని నుంచి 18 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.



ఆహార పొట్లాలను విజయవాడకు పంపుతున్న ఆర్డీవో



మంత్రి సారథి వితరణతో ఆహార పొట్లాలు పంపుతున్న దృశ్యం

స్పందించిన హృదయాలు..

విజయవాడ వరద బాధితులకు ఆహారం పంపిణీ చేసిన దాతలు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 3: విజయవాడ వరద బాధితులకు నూజివీడు డివిజన్ నుంచి ఆహార ప్యాకెట్లను పంపించారు. దాతలు, అధికారుల చేయూతతో పాటు ప్రభుత్వ నిధులు కూడా వెచ్చించి నూజివీడు డివిజన్ నుంచి సోమ, మంగళవారాల్లో 47 వేల ఆహార ప్యాకెట్లను తయారు చేయించి పంపించగా, విజయవాడ తీసుకువెళ్ళే వాహనాన్ని ఆర్డీవో వై.భవానిశంకరి జెండా ఊపి ప్రారంభించారు.

3 వేల మందికి మంత్రి ఆహార పొట్లాలు....

మంత్రి పార్థసారథి పిలుపుతో స్థానిక నూజివీడు నాయకులు 3 వేల ఆహార పొట్లాలను విజయవాడ వరద బాధితులకు పంపించారు. మంత్రి తన సొంత ఖర్చుతో 3 వేల మందికి ఆహారాన్ని పంపించారు. మంత్రి స్ఫూర్తితో నూజివీడు పట్టణానికి చెందిన కానూరి శ్రీధర్, షణ్ముఖ విజయ్‌లు రెండు రోజుల్లో 6 వేల ఆహారపొట్లాలను విజయవాడకు పంపించగా, టి.శ్రీకాంత్, చిన్నారి వై.బాబి, చిన్ని, రమేష్ తదితరులు 2 వేల మంది బాధితులకు సరిపడా భోజన ప్యాకెట్లను సింగ్‌నగర్, సత్యనారాయణపురం వరద బాధితులకు పంపించారు.

ముసునూరు తెలుగు తమ్ముళ్ల బిర్యానీ ప్యాకెట్ల వితరణ

ముసునూరు: విజయవాడ వరద బాధితులకు కాట్రేనిపాడుకు చెందిన టీడీపీ నాయకులు రాపర్ల మురళీ, అవిర్నేని శ్రీనివాసరావు 3 వేల ప్యాకెట్ల బిర్యానీ వితరణ చేశారు. విజయవాడ వరద బాధితులకు స్వయంగా అందజేశారు. వీరిని మంత్రి కొలుసు పార్థసారథి అభినందించారు.

చాట్రాయి: నూజివీడు ఎమ్మెల్యే, గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్ఫూర్తితో మండలంలోని చనుబండకు చెందిన టీడీపీ నాయకులు మంగళవారం విజయవాడలో 1000 మంది వరద బాధితులకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. చనుబండ గ్రామ టీడీపీ అధ్యక్షుడు చీదిరాల మారేశ్వరరావు, స్థానిక నాయకులు మోరంపూడి మురళీకృష్ణ, రమేష్, శ్రీరామ్, బొట్టు రమేష్, జక్కంపూడి కన్నా సొంత ఖర్చులతో వెయ్యి భోజనం ప్యాకెట్లు తయారు చేయించి ఆటోలో విజయవాడ తీసుకువెళ్ళి సింగ్‌నగర్, సత్యనారాయణపురంలలో బాధితులకు పంపిణీ చేశారు. వీరిని మంత్రి పార్థసారథి అభినందించారు. నూజివీడు నియోజవర్గంలోని కూటమి శ్రేణులు, ప్రజలు ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకోవాలని మంత్రి పిలుపు నిచ్చారు.

కలిదిండి: కొండంగి గ్రామ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మంగళవారం రెండు వ్యాన్లలో 2 వేల ఆహార పొట్లాలు విజయవాడ వరద బాధితులకు తరలించారు. కలిదిండి తహసీల్దార్ కార్యాలయం వద్ద వ్యాన్లను తహసీల్దార్ రామకృష్ణ ప్రారంభించి మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకోవటానికి దాతలు ముందుకు రావటం అభినందనీయమన్నారు. కోకా శ్రీనివాస్, అంకాల దుర్గా ప్రసాద్, పన్నాస వేణు, వీఆర్వోలు పమిడేశ్వరరావు, సారథి, ఆర్‌ఐ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బిర్యానీ ప్యాకెట్లు ఇస్తున్న కాట్రేనిపాడు తెలుగు తమ్ముళ్లు



భోజనం ప్యాకెట్లు తీసుకువెళ్తున్న చనుబండ తెలుగు తమ్ముళ్లు



కలిదిండిలో ఆహార పొట్లాల వ్యాన్లను తరలిస్తున్న తహసీల్దార్

మేము సైతం..

బియ్యం, నూనె ప్యాకెట్ల వితరణ



కలిదిండి, సెప్టెంబరు 3 : పడమటిపాలెంలో ముంపు బాధితులకు ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి రూ.35 వేల విలువ గల ఐదు క్వింటాళ్ల బియ్యం, నూనె ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేసి మాట్లాడుతూ ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకులు సుధాబత్తుల నరసింహారావు, పరసా రాజేష్, కురేళ్ల ఏడుకొండలు, వాకాని కోటేశ్వరరావు, చిట్టూరి అర్జునరావు, జనసేన నాయకులు కోలా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ చేయూత



నూజివీడు టౌన్, సెప్టెంబరు 3: భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన వారికి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కుటుంబానికి 10 కేజీల బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు అందజేశారు. వాసవీ జిల్లా ఇన్‌ఛార్జ్ చిన్నం శ్రీనివాసరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు వనమా వెంకటేశ్వరరావు, కార్యదర్శి శివరామకృష్ణ, వాసవీ క్లబ్ నాయకులు మానేపల్లి సతీష్, తటవర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలకు వాహనాల తరలింపు



ఆగిరిపల్లి, సెప్టెంబరు 3: విజయవాడ వరద బాధితుల సహాయార్థం నూజివీడు ఎంవీఐ నాగమురళీ, ఆగిరిపల్లి చుట్టుపక్కల గల 40 ట్రాక్టర్లు, 10 బస్సులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం తరలించారు. ఇవి ఆహార పదార్థాలు, బాధితుల తరలింపునకు ఉపయోగపడతాయని తెలిపారు.





మంత్రి ఆదేశాలతో రహదారి మరమ్మతులు

నూజివీడు, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు నూజివీడు-గంపలగూడెం రహదారికి గండిపడి రాకపోకలు స్తంభించిన విషయాన్ని స్థానికులు మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన రహదారిని పునరుద్ధరించాలని ఆదివారం సాయంత్రం అధికారులను ఆదేశించారు. సోమవారం కూడా రహదారి పునరుద్ధరణ ఎంతవరకు వచ్చిందని మంత్రి ఆరా తీయడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు మంగళవారం ఉదయానికి రోడ్డు మరమ్మతులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఏలూరు జిల్లాలోని పాడైన రహదారుల వివరాలను సంబంధిత అధికారుల నుంచి సేకరించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

వరదనీరు తొలగిస్తున్నారు..

ముసునూరు, సెప్టెంబరు 3: మండలంలోని ఎస్సీ కాలనీలో వరదనీరు తొలగింపునకు మంగళవారం సర్పంచ్, అధికారులు చర్యలు చేపట్టారు. సర్పంచ్ చలసాని దామోదరరావు ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో కాలనీలో డ్రెయినేజీల్లో పూడికతీత తీసి, వరద నీటిని తొలిగించారు. పనులను ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పరిశీలించారు. కాలనీలో వర్షం నీటిని పూర్తిగా తొలగించాలని కార్యదర్శి పామర్తి వీర్రాజుకు ఆయన సూచించారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన సీపీఐ

నూజివీడు టౌన్, సెప్టెంబరు 3: నూజివీడు పెద్దచెరువుకు గండిపడి పట్టణం అతలాకుతలం అయిన ప్రాంతాలను సీపీఐ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఏలూరు జిల్లా కార్యదర్శి మండవ కృష్ణచైతన్య, రాష్ట్ర నాయకులు గండి వెంకటేశ్వరరావు, కొమ్మన నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడారు. తొలుత పెద్దచెరువు గండి ప్రాంతాలను పరిశీలించిన నేతలు వరద వల్ల ధ్వంసమైన గృహాలను పరిశీలించారు. నష్టపోయిన వారికి తక్షణం పరిహారాన్ని ఇవ్వాలని, పెద్దచెరువు గట్టును బలోపేతం చేయాలని, నష్టపోయిన రైతాంగానికి పరిహారం ఇవ్వాలని, ధ్వంసమైన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు రాయంకుల లక్ష్మణరావు, కూచిపూడి నాగేశ్వరరావు, చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సీపీఎం

ముసునూరు, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు జి.రాజు కోరారు. మంగళవారం వలసపల్లి, ముసునూరు, చింతలవల్లి తదితర గ్రామాల్లో ముంపునకు గురైన వరి, పత్తి పంటలను ఆయన పరిశీలించారు. సీజనల్ వ్యాధులు మరింతగా ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలని, వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ముంపు ప్రాంతాల్లో బీజేపీ నాయకుల పర్యటన

నూజివీడు, సెప్టెంబరు 3: పట్టణంలో పెద్దచెరువు ముంపు ప్రాంతాలను ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువుకట్టలు తెగటం వల్ల నూజివీడు ప్రాంతంలో పంట పొలాలకు తీవ్రనష్టం వాటిల్లిందని, రహదారులు దెబ్బతిన్నాయన్నారు. తక్షణం నష్టపరిహారం ఇచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కాగా ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో వారు ట్రిపుల్ ఐటీని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బీజేపీ కన్వీనర్ జి.ఆర్.కె రంగారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు బోను అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిపూడి రాజశేఖర్, కోశాధికారి రవికాంత్, కార్యదర్శి మాగంటి వాసు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దోసపాటి జనార్థన్, పట్టణ ప్రధాన కార్యదర్శులు రెడ్డి మురళీమోహన్‌రావు, అంబటి మల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన వరద.. పునరావాసాల నుంచి ఇళ్లకు..

ముసునూరు, సెప్టెంబరు 3: చెక్కపల్లి అంబేద్కర్‌నగర్‌లో మంగళవారం నాటికి వరదనీరు పూర్తిగా తగ్గిపోవడంతో బాధిత కుటుంబాలు తమ గృహాలకు చేరుకున్నారు. బసవరపుపాడు వాగు ఉధృతికి ఈ కాలనీ ముంపునకు గురవడంతో సుమారు 30 కుటుంబాల వారికి జడ్పీ పాఠశాలలో అధికారులు పునరావాసం కల్పించగా, టీడీపీ నాయకులు వారికి అన్ని సౌర్యాలను సమ కూర్చారు. ఈ కాలనీ వరదనీరు తగ్గడంతో బాధితులు తమ ఇళ్ళకు చేరుకోగా, వారికి టీడీపీ నాయకులు నిత్యావసర సరుకులను అందజేశారు. అలాగే రమణక్కపేటలో కుమ్మరివారి బజారులో ఇళ్ళచుట్టూ ఉన్న నీటిని సైతం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఆధ్వర్యంలో తొలిగించారు. అలాగే నూజివీడు ప్రధాన రహదారిలో సింహాద్రిపురం వద్ద రాములేరు వాగు, వలసపల్లి రహదారిలో సంధ్య వాగుల్లో నీరు తగ్గడంతో రాకపోకలు కొనసాగుతున్నాయి.

ఆశా వర్కర్ల నిరసన

నూజివీడు టౌన్, సెప్టెంబరు 3: సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు నూజివీడు కోనేరుపేట పీహెచ్‌సీ సెంటర్ వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి. రాజు మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను అమలు పరచాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను అరికట్టేలా కఠిన చర్యలు తీసుకోవాలని, కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు కమల, నాగమణి, స్వాతి, కుమారి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

తమవారెలా ఉన్నారో..?

వరద ప్రాంతాల్లో ఉన్న వారిపై బంధువుల్లో ఆందోళన

విజయవాడలో వరదల్లో చిక్కుకున్న తమ వారి యోగ క్షేమాలను తెలుసుకునేందుకు ముదినేపల్లి ప్రాంతంలో ఉన్న వారి కుటుంబీకులు, బంధువులు ఆదుర్దా పడుతున్నారు. విజయవాడలోని సింగ్ నగర్, రామలింగేశ్వర నగర్, ఇబ్రహీంపట్నం, కృష్ణలంక, రామవరప్పాడు బుడమేరు వెంబడి భారీగా వరద వచ్చిన ప్రాంతాల్లో ముదినేపల్లి మండలం వాడవల్లి, పెదగొన్నూరు, శ్రీహరిపురం తదితర గ్రామాలకు చెందిన కుటుంబాలు పెద్ద సంఖ్యలో నివాసం ఉంటున్నాయి. పై గ్రామాలకు చెందిన సుమారు 50 కుటుంబాలు రామలింగేశ్వరనగర్‌లో ఉంటున్నారు. ఇళ్లల్లోకి వరద నీరు రావటంతో విజయవాడలో బంధువుల ఇళ్లలో కొందరు తలదాచుకుంటుండగా, మరి కొందరు గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఫస్ట్ ఫ్లోర్‌కు వెళ్లి ఆశ్రయం పొందుతున్నారు. వరద ప్రాంతాల్లో విద్యుత్ లేక సెల్‌ఫోన్లు కూడా పని చేయకపోవటంతో ఇక్కడి వారు మరింత కంగారు పడుతున్నారు. సురక్షిత ప్రాంతాల్లో ఉన్న బంధువులకు ఫోన్లు చేసి తమ వాళ్ల క్షేమ సమాచారం తెలుసుకుంటున్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్‌లకు ఫోన్లు చేసి కూడా సమాచారం తెలుసుకుంటున్నారు.

-ముదినేపల్లి

తాగునీటి పథకాల్లో వాల్‌పిట్ చాంబరే కీలకం : డీపీవో



ముదినేపల్లి, సెప్టెంబరు 3 : రక్షిత మంచినీటి పథకాల ద్వారా తాగునీటి సరఫరా చేసే విషయంలో గ్రామ పంచాయతీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస విశ్వనాథ్ కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. గురజ గ్రామంలో ఆయన ఈవోపీఆర్‌డి లక్ష్మీనారాయణతో కలసి మంగళవారం రక్షిత మంచినీటి పథకం నిర్వహణను పరిశీలించి మెయిన్ వాల్ పిట్ చాంబర్‌ను తెరిపించి చూశారు. ఆ పిట్‌లో వర్షపు నీరు చేరి కలుషితమైనట్టు గుర్తించారు. నీటి పథకం నిర్వహణలో మెయిన్ వాల్ పిట్ ఛాంబర్ ముఖ్యమైనదని, అది కలుషితమైతే ప్రజలకు స్వచ్ఛమైన నీరు సరఫరా చేయలేమని పేర్కొన్నారు. దీంతో అక్కడి నుంచే డీపీవో జిల్లాలోని డీఎల్‌పీవో, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులకు సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రతి గ్రామంలోను మెయిన్ వాల్ పిట్ చాంబర్‌ను వర్షాకాలంలో ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. వర్షాల అనంతరం గ్రామాల్లో ఏర్పడిన పరిస్థితులు, పారిశుధ్య నిర్వహణ, మంచినీటి చెరువుల క్లోరినేషన్ తదితర అంశాలపై డీపీవో మంగళవారం ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో సమీక్షించారు. అనంతరం గురజలో సర్పంచ్ సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఎంపీడీవో మల్లీశ్వరి, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, ముదినేపల్లి, గురజ పంచాయతీల కార్యదర్శులు కె.శ్రీనివాస్, పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ముందస్తు నిర్ణయాలు అక్కరకొచ్చాయి'



చాట్రాయి, సెప్టెంబరు 3: వరద బీభత్సంతో విజయవాడలోని పాల ఫ్యాక్టరీ దారుణంగా దెబ్బతిని రూ. 70 కోట్లు నష్టం వాటిల్లినా కృష్ణామిల్క్ యూనియన్ యాజమాన్యం ముందుచూపుతో తీసుకున్న నిర్ణయం సంక్షోభంలో అక్కరకు వచ్చిందని సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు అన్నారు. చీపురుగూడెంలో మంగళవారం జరిగిన పాడి రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీరవల్లిలో నిర్మించిన అధునాతన పాల కర్మాగారం ఆపదలో ఆదుకుందన్నారు. కొత్త ఫ్యాక్టరీ ఉండటం వలన పాల సేకరణకు, పాల ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్‌కు ఆటంకం లేకుండా పోయిందన్నారు. ఇందుకు చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ ఈశ్వరబాబు కృషి అభినందనీయం అన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

చాట్రాయి, సెప్టెంబరు 3: మండలంలోని చాట్రాయి, చనుబండ పంచాయతీల ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. వీధులు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది ప్రజలతో మాట్లాడుతూ భారీ వర్షాలు కారణంగా సీజనల్ జ్వరాలు, డయేరియా ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రతి ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు.

క్రైం సమాచారం

వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ఆగిరిపల్లి, సెప్టెంబరు 3: నాలుగు రోజుల క్రితం ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడుకు చెందిన నాగప్రసాద్ అనే వ్యక్తి పోలసానపల్లి వెళుతూ మార్గ మధ్యంలో వాగులో వరద ఉధృతికి గల్లంతైన విషయం విదితమే. మంగళవారం అతని మృతదేహం పోలసానపల్లి గ్రామ పరిధిలోని కురివిడి చెరువులో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు లభించింది. కాగా మృతుడి కుటుంబాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తాళం వెంకటేశ్వరరావు, అడ్వొకేట్ జొన్నలగడ్డ శివశంకర్, పోలసానపల్లి సర్పంచ్ నాగ ముసలయ్య తదితరులు మృతుడి కుటుంబీకులను పరామర్శించారు.

ఆవులను తరిమి ఆయాసంతో ఒకరి మృతి

ముదినేపల్లి, సెప్టెంబరు 3 : తమ ఇంటి ఆవరణలోకి వచ్చిన ఆవులను తోలేందుకు హడావిడిగా వెళ్లి తిరిగి ఆయాసంతో ఇంటికి వచ్చి గుండెపోటుకు గురై ఓ వ్యక్తి మరణించిన ఘటన సోమవారం రాత్రి ముదినేపల్లి మండలం వైవాక గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కుర్మా సామియేలు బెనర్జీ (58) తమ ఇంటి ఆవరణలోకి వచ్చిన ఆవుల మందను రోడ్డు మీదికి తరుముకుంటూ వెళ్లాడు. వాటి వెంట పరుగెత్తుకుంటూ దూరంగా తరిమేసరికి తీవ్ర ఆయాసానికి గురయ్యారు. ఇంటికి తిరిగి వచ్చి కాసేపు ఇబ్బంది పడిన బెనర్జీ గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. ఆయనకు భార్య ఉంది.



చెక్కపల్లి ప్రధాన రహదారి గండిని పరిశీలిస్తున్న ఎస్ఈ జాన్ మోషే



చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే వద్ద కాపలా

తమ్మిలేరుతో అప్రమత్తంగా ఉండాలి

ముసునూరు, సెప్టెంబరు 3: తమ్మిలేరు వరద ఉధృతి కొనసాగుతూనే ఉన్న నేపథ్యంలో పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు కోరారు. మంగళవారం బలివే వద్ద తమ్మిలేరులో వరద ప్రవాహాన్ని ఆయన పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. తమ్మిలేరు పరీవాహక గామాలైన వలసపల్లి, గుడిపాడు, లోపూడి, గుళ్ళపూడి, వెంకటాపురం, బలివే, యల్లాపురం, వేల్పుచర్ల, రంగంపేటల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని సిబ్బంది తెలిపారు. మరి కొద్ది రోజులు తమ్మిలేరులో వరద ప్రవాహం కొనసాగే అవకాశం ఉందని, తమ్మిలేరులోకి చేపలు వేటకు, ఈతకు వెళ్ళవద్దని సూచించారు. కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.

గండిని పరిశీలించిన ఎస్ఈ

చెక్కపల్లి వద్ద సంధ్య వాగు వరద ఉధృతికి ప్రధాన రహదారి కోతకు గురై గండి పడిన ప్రదేశాన్ని ఆర్అండ్‌బీ ఎస్ఈ జి.జాన్‌మోషే మంగళవారం పరిశీలించారు. పూడ్చివేతకు కావలసిన మెటీరియల్ తదితర వివరాలను డీఈ సీహెచ్.బాబూరావు, ఏఈ జి.అశోక్‌బాబుతో చర్చించి నివేదిక తీసుకున్నారు. ఎస్ఈ మాట్లాడుతూ ఇంకా సంధ్య వాగులో వరదనీరు ప్రహిస్తోందని, రెండు రోజుల్లో నీరు తగ్గే అవకాశం ఉన్నందన్నారు. గండిని పూడ్చేందుకు అవసరమైన మెటీరియల్‌ను వెంటనే సిద్ధం చేయాలని డీఈ, ఏఈలకు సూచించారు. వాగులో నీటి ప్రవాహం తగ్గిన వెంటనే సిమెంట్ తూరలు వేసి గండిని పూడ్చి, రాకపోకలను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం సిమెంట్ తూరలు వేసి, సమస్య పరిష్కరిస్తామని, భవిష్యత్‌లో సంధ్యవాగుపై వంతెన నిర్మించేలా చర్యలు తీసుకుంటామని ఎస్ఈ తెలిపారు.

చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే వద్ద కాపలా..

చాట్రాయి: చిన్నంపేట, చింతలపూడి మండలం శివపురం గ్రామాల మధ్య ఉన్న తమ్మిలేరు కాజ్‌వేకి గండి పడటంతో ప్రమాదాలు జరగకుండా రెవెన్యూ, పోలీస్, పంచాయతీ సిబ్బంది నిరంతరం కాపలా కాస్తున్నారు. రెండు మండలాలను కలిపే రహదారి కావటంతో ఎవరైనా తమ్మిలేరును దాటే ప్రయత్నం చేయకుండా సిబ్బంది పహరా కాస్తున్నారు. చిన్నంపేట రైతులకు శివపురంలో, అక్కడి రైతులకు ఇక్కడ వ్యవసాయ భూములు ఉండటంతో రైతులు కాజ్‌వే వద్దకు వస్తుండగా సిబ్బంది వారిని వెనక్కి పంపించి వేస్తున్నారు.

కొల్లేరుకు పొంచి ఉన్న ముప్పు..

కైకలూరు: కైకలూరు మండలంలోని కొల్లేరు లంక గ్రామాలకు రానున్న రోజుల్లో వరద నీరు భారీగా చేరుతుందని అందువల్ల కొల్లేరు లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఉదయ భాస్కరరావు అన్నారు. మంగళవారం మండవల్లి మండలంలోని పెద్ద, చినఎడ్లగాడి వద్ద కొల్లేరు వరద ఉధృతిని పరిశీలించారు. ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తున్నందున కైకలూరు మండలంలోని కొల్లేరు ప్రాంతానికి మరో రెండు, మూడు రోజుల్లో నీరు చేరుతుందన్నారు. ముందస్తుగా ఎక్కడికక్కడే ప్రజలను హెచ్చరిస్తూ జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ముంపు నివారణకు చర్యలు



కైకలూరు, సెప్టెంబరు 3: కైకలూరులో ముంపు నివారణ చర్యలను అధికారులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీటి పారుదలకు అవరోధం లేకుండా ఎక్స్‌కవేటర్లతో పనులు నిర్వహించారు. మంగళవారం కైకలూరులోని కొత్తపేట ఉర్దూ పాఠశాల సమీపంలోని డ్రెయిన్లను, ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకున్నారు. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ ఉదయభాస్కరరావు, ఈవోపీఆర్డీ ఆర్. రవిశంకరరావు, ఈవో వెంకటేశ్వరరావు డ్రెయిన్ల మరమ్మతులు పర్యవేక్షించారు. అలాగే డ్రెయిన్లు ఆక్రమణకు గురైన ప్రదేశాల్లో తూరలను తొలగించి ఆ ప్రాంత ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు కురవనున్నందున ముందస్తు చర్యల్లో భాగంగా డ్రైన్లను ఎక్కడికక్కడే ఆధునీకరిస్తున్నామన్నారు. ఎక్కడైనా మురుగునీరు నిల్వ ఉన్నా, డ్రెయిన్ల పారుదల లేకున్నా తెలపాలన్నారు.

ముంపు బారిన ఆర్‌అండ్‌బీ రహదారి



కైకలూరు, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు డ్రైన్లు పొంగి పొర్లుతుంటే రైతులు చేపలచెరువుల నీటిని మోటార్లు ద్వారా బయటకు తోడటంతో రహదారి ముంపునకు గురైంది. కైకలూరు మండలం వేమవరప్పాడులోని పెదకొమ్మిలేరు డ్రెయిన్ నుంచి వేమవరప్పాడు మంచినీటి కాలువ వరకు ఉన్న కైకలూరు-కోరుకొల్లు ఆర్‌అండ్‌బీ రహదారి ముంపు బారిన పడింది. ఒకవైపు డ్రెయిన్ పొంగి పొర్లుతుండగా రైతులు తమ చెరువుల్లోని నీటిని బయటకు తోడటంతో ఈ సమస్య తలెత్తిందని ఆ రహదారిలో ప్రయణిస్తున్నవారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రెయిన్లు పొంగటంతో రహదారి ముంపుకు గురవుతుందని భయపడిన ప్రజలకు చేపలచెరువుల నీటిని డ్రైన్లకు తరలించడంతో ఈ సమస్య మరింత పెరిగిందని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎంపీడీవో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు నీరు చెరువుల నుంచి బయటకు తోడే రైతులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

సూరంపాలెంలో వైద్యశిబిరం



చాట్రాయి, సెప్టెంబరు 2: పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సూరంపాలెం దళితవాడలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ భారీ వర్షాలు కారణంగా సీజనల్ జ్వరాలు, డయేరియా ప్రబలే ప్రమాదం ఉన్నదని ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహారం మాత్రమే తినాలని, దోమతెరలు వాడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే చికిత్స చేయించుకోవాలని కోరారు.



పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 3: భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్, శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలోని బృందం మంగళవారం పరిశీలించింది. నూజివీడు మండలం మర్రిబందం, నూజివీడు, ముక్కొల్లుపాడు, రామన్నగూడెం తదితర ప్రాంతాల్లో ముంపుకు గురైన పొలాలను పరిశీలించి మినుము, వరి, సీడ్ పత్తి తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. శాస్త్రవేత్త నాగేంద్రరావు, ఏడీఏలు లలిత సుధ, జి.విద్యాసాగర్, మండల వ్యవసాయాధికారిణి చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన..

ముంపునకు గురైన ఉద్యానవన పంటలకు తక్షణం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, ఉద్యానవనశాఖ అధికారిణి ఆర్.హేమ తెలిపారు. మండలంలో అధిక వర్షాలకు 174 ఎకరాల ఉద్యానవన పంటలు నీట మునిగాయన్నారు. దాదాపు 122 మంది రైతులు పంటలను నష్టపోయారన్నారు. నీరు నిలిచిన తోటల్లో నీటిని బయటకు పంపి, అరటి తోటల్లో చెట్టుకు 100 గ్రాములు యూరియా, 80 గ్రాముల పొటాష్‌ను వేసుకోవాలన్నారు. అలాగే బొప్పాయికి కాపరాక్సిక్లోరైడ్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. మామిడి తోటల్లో మామిడి మొక్కకు పొటాషియం నైట్రేట్ పది గ్రాములు, బోరాక్స్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు.

నేడు జరగాల్సిన స్కూల్ గేమ్స్ వాయిదా

పెదవేగి, సెప్టెంబరు 3 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో భాగంగా 4వ తేదీన జరగాల్సిన ఎంపిక పోటీలను వర్షం, వరదల కారణంగా వాయిదా వేశామని అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, పెదవేగి గురుకుల విద్యాలయం పీడీ కందికొండ జయరాజు తెలిపారు. 4వ తేదీన పెదవేగిలోని గురుకుల విద్యాలయంలో బాల, బాలికలకు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, అథ్లెటిక్స్, సెపక్ తక్రా, కుస్తీ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారని 4వ తేదీన జరిగే పోటీలను మాత్రమే వాయిదా వేశామని ఎప్పుడు జరిగేదీ త్వరలో ప్రకటిస్తామన్నారు. మిగిలిన పోటీలు ముందుగా ప్రకటించిన ప్రకారం ఈనెల 6వతేదీ శుక్రవారం నుంచి 21వ తేదీ సోమవారం వరకు యధాతథంగా జరుగుతాయని తెలిపారు.

'కనీస పరిజ్ఞానం లేని జగన్'

కైకలూరు, సెప్టెంబరు 3: మాజీ సీఎం జగన్మోహనరెడ్డి వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లి మాట్లాడిన తీరు హాస్యాస్పదంగా ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. మంగళవారం ఆయన కైకలూరులో విలేకర్లతో మాట్లాడుతూ బుడమేరుకు గేట్లు ఉన్నాయో లేదో కూడా తెలియకుండా జగన్ మాట్లాడుతున్నారన్నారు. బుడమేరుకు గేట్లు ఎత్తివేశారంటూ మాట్లాడడం అవివేకం అన్నారు. చంద్రబాబు ఇళ్ళు రక్షించుకోవడానికి విజయవాడలోని ప్రజల ఇళ్లు ముంచేశారనడం దారుణమన్నారు.